


# విభారె
తెలుగు దినపత్రిక
VIBHARE TELUGU DAILY








PUBLISHED FROM KURNOOL ఎడిటర్: ఆవుల విజయ భాస్కర రెడ్డి శనివారం 11-06-2022 సంపుటి: 03 సంచిక: 262 పేజీలు: 4 వెల: రూ 3-00


# ప్రొఫెషనలిజం ద్వారా ఆదాయాలు పెంచండి..

## రెవెన్యూ ఎర్నింగ్ శాఖలపై సమీక్షలో సీఎం జగన్



తాడేపల్లి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రెవెన్యూ ఎర్నింగ్ శాఖలపై శుక్రవారం సమీక్ష చేపట్టారు. తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ సమావేశానికి.. పలువురు మంత్రులు, వివిధ శాఖల అధికారులు హాజరయ్యారు.సీఎం జగన్ అధ్యక్షతన జరిగిన రెవెన్యూ ఎర్నింగ్ శాఖలపై రివ్యూ మీటింగ్‌లో.. వాణిజ్య పన్నులు, ఎక్సైజ్, రిజిస్ట్రేషన్స్, రవాణా, భూగర్భగనులు, అటవీ తదితర శాఖల అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా.. శాఖల వారీగా సమీక్ష నిర్వహించారు సీఎం జగన్. అదే సమయంలో ఆదేశాలు, కీలక సూచనలతో పాటు ప్రొఫెషనలిజం ద్వారా ఆదాయాలు పెంచుకోవాలని అధికారులకు సూచించారాయన.

ఓటీఎస్ పథకం కింద లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్లను వేగంగా పూర్తిచేయాలని సీఎం జగన్ ఈ సందర్భంగా అధికారులను ఆదేశించారు.

టిడ్కోకు సంబంధించి కూడా రిజిస్ట్రేషన్లను పూర్తిచేయాలి.

గ్రామ, వార్డు సచివాలయాల్లోకి రిజిస్ట్రేషన్ సేవలు అందుబాటులోకి తీసుకు వచ్చాక.. సిబ్బందికి, ఆపై ప్రజలకు అవగాహన కల్పించాలి.

ఎలాంటి సేవలు పొందవచ్చు అనే దానిపైనా అవగాహన కల్పించాలి.

కేవలం ఆస్తుల రిజిస్ట్రేషనే కాకుండా.. రిజిస్ట్రేషన్ పరంగా అందించే ఇతర సేవలపైన కూడా పూర్తిస్థాయి సమాచారం, అవగాహన కల్పించాలి.

రిజిస్ట్రేషన్ ప్రక్రియతో న్యాయపరంగా ఎలాంటి హక్కులు వస్తాయి, ఎలాంటి భద్రత వస్తుందన్న విషయాలను తెలియజేయాలి.

అక్టోబరు 2న తొలివిడతగా.. గ్రామాల్లో శాశ్వత భూ హక్కు, భూ రక్ష పత్రాలతో పాటు సంబంధిత సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ సేవలు అందించడానికి చర్యలు తీసుకోవాలి అని సీఎం జగన్ ఆదేశించారు.

ఈ సందర్భంగా అధికారులు.. ఇప్పటికే 650 గ్రామాల్లో జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పత్రాలతో పాటు రిజిస్ట్రేషన్ సేవలు అందించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు, ఈ గ్రామాల సంఖ్యను పెంచడానికి చర్యలు చేపట్టినట్లు అధికారులు సీఎం జగన్‌కు తెలిపారు. అంతేకాదు.. 14వేలమంది గ్రామ, వార్డు సెక్రటరీలకు రిజిస్ట్రేషన్‌పై శిక్షణ కూడా అందిస్తున్నట్లు చెప్పారు. ఈ క్రమంలో.. రిజిస్ట్రేషన్ సేవలు, భూ హక్కు?భూ రక్ష కింద పత్రాలు అందించే గ్రామాల సంఖ్యను పెంచడానికి ప్రయత్నించాలని సీఎం జగన్, అధికారులకు సూచించారు.

వెదురు పెంపకాన్ని ప్రోత్సహించేలా చర్యలు తీసుకోవాలని అటవీశాఖకు సీఎం జగన్ ఆదేశాలు జారీ చేశారు. అలాగే.. మైనర్ మినరల్‌కు సంబంధించి కార్యకలాపాలు నిర్వహించని క్వారీలు 2,700కుపైగా ఉన్నాయని, కార్యకలాపాలు తిరిగి ప్రారంభించాల్సిన అవసరం ఉందని అధికారులు వెల్లడించారు. ఈ అంశంపై దృష్టి సారించాలని, తద్వారానే ప్రభుత్వానికి ఆదాయాలు పెరుగుతాయని సీఎం జగన్ చెప్పారు. ఏపీఎండీసీ నిర్వహిస్తున్న సులియారీ బొగ్గు గనుల నుంచి ఉత్పత్తి ప్రారంభమైందని అధికారులు వెల్లడించారు. జెన్‌కో సహా.. రాష్ట్రంలోని పలు పరిశ్రమలకు దీని నుంచి బొగ్గు సరఫరా అయ్యేలా చూసుకోవాలని, దీనివల్ల జెన్‌కో ఆధ్వర్యంలోని విద్యుత్ ప్రాజెక్టులకు మేలు జరుగుతుందన్న సీఎం జగన్ తెలిపారు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా బొగ్గు ధరలు మండిపోతున్న దృష్ట్యా.. ఈ బొగ్గును మన అవసరాలకు వినియోగించుకునేలా చూడాలని సీఎం జగన్ అధికారులతో చెప్పారు. దీనిపై కార్యాచరణ రూపొందించి తనకు నివేదించాలన్న సీఎం జగన్, తదుపరి కూడా బొగ్గుగనుల వేలం ప్రక్రియలో పాల్గొనడంపై దృష్టిపెట్టాలని అధికారులను ఆదేశించారు.సమీక్షలో వాణిజ్య పన్నుల శాఖ పునర్‌నిర్మాణానికి నిర్ణయం తీసుకున్నారు సీఎం జగన్. శాఖలో ప్రతి ఒక్కరి పాత్ర, బాధ్యతలపై స్పష్టతతో పాటు డాటా అనలిటిక్స్ విభాగం, లీగల్‌సెల్ కూడా ఏర్పాటు చేయబోతున్నారు. అలాగే.. బకాయిల వసూలుకు ఓటీఎస్ సదుపాయం కల్పించనున్నారు. జూన్‌కల్లా వాణిజ్య పన్నుల శాఖలో ఈ విభాగాల ఏర్పాటు జరగనుంది. వీటితో పాటు అక్రమ మద్యం తయారీ, అక్రమ మద్యం రవాణాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు సీఎం జగన్. ఈ సమీక్షా సమావేశానికి ఉపముఖ్యమంత్రి (ఎక్సైజ్ శాఖ) కె నారాయణ స్వామి, రెవెన్యూశాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు, ఇంధన,అటవీ పర్యావరణ, భూగర్భగనులశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, సీఎస్ సమీర్ శర్మ, అటవీ పర్యావరణం, సైన్స్ అండ్ టెక్నాలజీ స్పెషల్ సీఎస్ నీరబ్ కుమార్ ప్రసాద్, రెవెన్యూ శాఖ స్పెషల్ సీఎస్ రజత్ భార్గవ, ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ చీఫ్ కమిషనర్ జి సాయి ప్రసాద్, ఆర్థికశాఖ స్పెషల్ సీఎస్ ఎస్ ఎస్ రావత్, రవాణాశాఖ ముఖ్య కార్యదర్శి ఎం టీ కృష్ణబాబు, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గనులశాఖ ముఖ్య కార్యదర్శి గోపాలకృష్ణ ద్వివేది, ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్సు ఎన్ ప్రతీప్ కుమార్, ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు.

# ప్రజాశక్తితో పోలీసుల ఆలోచనను మారుస్తాం : చంద్రబాబు



అమరావతి: రాష్ట్రంలో జరుగుతున్న అరాచకపాలనకు అడ్డుకట్ట వేయకపోతే పోలీసుల ఆలోచనను ప్రజాశక్తి తో మారుస్తామని టీడీపీ అధినేత చంద్రబాబు వెల్లడించారు. క్విట్ జగన్ -సేవ్ ఆంధ్రప్రదేశ్ పేరిట ముద్రించిన బుక్‌లెట్‌ను టీడీపీ ఏపీ కార్యాలయంలో చంద్రబాబు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను తిలకించారు. ఆయన మాట్లాడుతూ ఏపీలో కొత్త డీజీపీ వచ్చిన తరువాత అరాచకాలు మరింత పెరిగాయని ఆరోపించారు. శాంతి భద్రతలను పరిరక్షించవలసిన పోలీసులు రాజ్యాంగ హక్కులను ఉల్లంఘిస్తున్నారని విమర్శించారు.ప్రశ్నించేవారిపై కేసులు నమోదు చేస్తారా అని ప్రశ్నించారు. ఇప్పటికే రాష్ట్ర పోలీసులు ప్రజల్లో చులకన య్యారని, ప్రజల్లో పోలీసు వ్యవస్థపై గౌరవం పోయిందని అన్నారు. మాచర్ల, ఆత్మకూరు నియోజకవర్గంలో అనేక కుటుంబాలు వైసీపీ ధాష్టికాల వల్ల వేరే ప్రాంతాల్లో బ్రతుకుతున్నారని తెలిపారు. వైఎస్ వివేకా హత్య కేసులో సంబంధమున్న శ్రీనివాస్‌రెడ్డి, గంగిరెడ్డి, గంగాధర్ రెడ్డి అనే వ్యక్తులు అనుమానస్పద స్థితిలో మరణాల వెనుక ఉన్న కారణాలను ఎందుకు అన్వేషించడం లేదని పోలీసులను ప్రశ్నించారు.వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత 60 మంది టీడీపీ కార్యకర్తలు హత్యకు ప్రత్యర్థుల చేతిలో హత్యకు గురయ్యారని, 4వేల మంది టీడీపీ కార్యకర్తలపై కేసులు నమోదు చేశారని ఆరోపించారు. శాంతియుతంగా ఉండే రాష్ట్రాన్ని మూడేళ్లలో వల్లకాడు చేశారని చంద్రబాబు మండిపడ్డారు. ప్రభుత్వాన్ని కట్టడి చేయకుంటే రాష్ట్రం అంధకారమవుతుందని పేర్కొన్నారు.

# కృష్ణా డెల్టాకు సాగునీటిని విడుదల చేసిన మంత్రి అంబటి





విజయవాడ: కృష్ణా డెల్టాకు సాగునీరు విడుదలైంది. రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు సాగునీటిని విడుదల చేశారు. ఖరీఫ్ పంట కోసం కృష్ణా డెల్టాలోని ఆయకట్టుకు నీటిని విడుదల చేశారు. కృష్ణా తూర్పు డెల్టాకి 1500 క్యూసెక్కులు, పశ్చిమ డెల్టాకి 500 క్యూసెక్కులు సాగునీరు విడుదలైంది. కృష్ణా డెల్టా చరిత్రలో ముందుగానే సాగునీటిని విడుదల చేయడం రికార్డు. నెలరోజుల ముందే సాగునీటిని ప్రభుత్వం విడుదల చేసింది.కృష్ణా డెల్టా పరిధిలో 13 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. కృష్ణా డెల్టా పరిధిలో కృష్ణా, గుంటూరు, ప్రకాశం, పశ్చిమగోదావరి జిల్లాలు ఉన్నాయి. పులిచింతలలో పుష్కలంగా నీరు ఉండటంతో 35 టీఎంసీల సాగునీరు అందుబాటులోకి వచ్చింది. మరో రెండు రోజులలో ఏపీలో రుతు పవనాలు ప్రవేశించనున్నాయి. రుతు పవనాల రాకతో సాగునీటికి ఇబ్బంది ఉండదని రైతులు అంటున్నారు. ఇప్పటికే జూన్ ఒకటి నుంచి గోదావరి డెల్టా పరిధిలోనూ సాగునీటిని ప్రభుత్వం విడుదల చేసిన సంగతి తెలిసిందే. సాగునీటిని ముందుగా విడుదల చేయడంతో నవంబర్‌లో ఖరీఫ్ పూర్తి కానుంది. రెండో పంటని కూడా డిసెంబర్ నెలలోనే వేసుకునే అవకాశం ఉంది. కృష్ణా డెల్టాకి 155 టీఎంసీల సాగునీరు అవసరమవుతుందని సాగునీటి అధికారులు అంచనా వేస్తున్నారు.

# తండ్రి కొడుకులకు తగిన బుద్ధి చెప్తాం.. విజయసాయిరెడ్డి హెచ్చరిక

విజయవాడ: ఎన్టీఆర్ జిల్లాలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విజయసాయిరెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి హోం శాఖ మంత్రి తానేటి వనిత, గృహనిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్, మాజీ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాస్, మేయర్ భాగ్యలక్ష్మి, పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరయ్యారు. అన్ని జిల్లాల్లోనూ పార్టీ సొంత కార్యాలయాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీ విజయసాయిరెడ్డి తెలిపారు. ఎన్నికలకు సంవత్సరం ముందే 26 జిల్లాలోనూ అందుబాటులోకి వస్తాయన్నారు. పార్టీ ఆఫీస్ అంటే దేవాలయం లాంటిదని మా నమ్మకమన్నారు.ఈ మేరకు ఎంపీ విజయసాయిరెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. టీడీపీ కుసంస్కారంతో వ్యవహరిస్తోంది. మావాళ్లని అసభ్య పదజాలంతో దూషిస్తున్నారు. లోకేష్‌కు పుట్టుకతో వచ్చిన సమస్య వలన ఇలా తయారయింది. నిన్న లోకేష్ జూమ్ మీటింగ్ కి కంసమామ జగన్ అంటూ పేరు పెట్టారు. అంటే ఎంత జుగుప్సాకరమైన వ్యవహారాలు చేస్తున్నారో చూడండి. అందుకే ప్రశ్నించటానికి మా వాళ్లు వెళ్లారు. తండ్రి కొడుకులు బుద్ధి మార్చుకోకపోతే మేము తగిన బుద్ధి చెప్తామని విజయసాయిరెడ్డి హెచ్చరించారు. నిన్నటిది కేవలం ఆరంభం మాత్రమే. రానున్న రోజుల్లో మరింతగా ఎదురుదాడి చేస్తాం. అందుకే ఇకనైనా పద్ధతులు మార్చుకోండి. టెన్త్ ఫెయిల్ అవటానికి కారణాలు తెలుసుకోవాలేగానీ సీఎంని తిట్టాల్సిన పనేంటి?. కుసంస్కారంతో మా నాయకులను తిట్టించకుండా వాస్తవాలు తెలుసుకోండి. ప్రజాస్వామ్య పద్ధతుల్లో వ్యవహరించండి. లోకేష్ సవాల్‌ని స్వీకరిస్తున్నాం. చర్చకు రావాల్సిందిగా కోరుతున్నా. చంద్రబాబు వచ్చినా సరే చర్చకు మేము సిద్ధం. జూమ్‌లో మా ప్రశ్నలకు సమాధానం చెప్పలేక పారిపోయారు.



# వ్యవసాయ బడ్జెట్ కేటాయింపులు బయటపెట్టాలి:సోమిరెడ్డి



వ్యవసాయ శాఖ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డికి దమ్ముంటే మూడేళ్లలో వ్యవసాయ బడ్జెట్‌లో లక్షా 10వేల కోట్లు ఖర్చు చేసినట్లు నిరూపించాలని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి సవాల్ విసిరారు. రైతుల కోసం వ్యవసాయ బడ్జెట్ ఎంత కేటాయించారు? ఎంత ఖర్చు పెట్టారో సమాధానం చెప్పాలన్నారు. వ్యవసాయ బడ్జెట్ కేటాయింపులు ప్రకటిస్తే తాను చర్చకు సిద్ధమన్నారు. రూ.43వేల కోట్ల ధాన్యం కొనుగోళ్లు కూడా రైతుల కోసం పెట్టిన ఖర్చుగా చూపడం సిగ్గుచేటన్నారు. వ్యవసాయ మోటర్లకు మీటర్ల బిగింపు అమ్మఒడి పథకం తరహాలో మరో మోసమని, తొలుత మీటర్లు అని తర్వాత ఆంక్షల పేరుతో రైతుల్నిమోసగించే కుట్ర దాగి ఉందన్నారు.

# ఖాళీ సీట్ల భర్తీకి మరోసారి కౌన్సెలింగ్‌కు సుప్రీంకోర్టు నో

న్యూఢిల్లీ : ఔఇఖ ఖఉ 2021 ఆలిండియా కోటాలో ఖాళీ సీట్లను భర్తీ చేయడం కోసం ప్రత్యేక స్ట్రే రౌండ్ కౌన్సెలింగ్ నిర్వహించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు శుక్రవారం తోసిపుచ్చింది. ఇప్పటికే 8-9 రౌండ్లు జరిగాయని, తాజాగా మరోసారి కౌన్సెలింగ్‌ను నిర్వహించరాదని తీసుకున్న నిర్ణయం నిరంకుశంగా తీసుకున్నది కాదని, వైద్య విద్య, ప్రజారోగ్యాల ప్రయోజనాల కోసమేనని వివరించింది. కేంద్ర ప్రభుత్వం, మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకుని స్పెషల్ స్ట్రే రౌండ్ కౌన్సెలింగ్‌ను నిర్వహించరాదని నిర్ణయించినపుడు, దానిని నిరంకుశ చర్యగా పరిగణించలేమని జస్టిస్ ఎంఆర్ షా, జస్టిస్ అనిరుద్ధ బోస్ ధర్మాసనం తెలిపింది. ఇదేమీ కొత్త విషయం కాదు2022 మే 7న జరిగిన కౌన్సెలింగ్ అనంతరం దాదాపు 1,456 సీట్లు ఖాళీగా ఉండిపోయాయి. దీనిపై జస్టిస్ షా మాట్లాడుతూ, ఖాళీ సీట్లు ఉండటం చాలా సంవత్సరాల నుంచి జరుగుతోందని, ఈ ఏడాది మాత్రమే అది కొత్త విషయం కాదని చెప్పారు. ప్రతి కసరత్తుకు ఓ పరిమితి ఉండాలన్నారు. పదో రౌండ్ కౌన్సెలింగ్ తర్వాత కూడా సీట్లు ఖాళీగా ఉండిపోయే అవకాశం లేకపోలేదన్నారు. ప్రజల ఆరోగ్యానికి నష్టంఏడాదిన్నర తర్వాత హక్కులను విద్యార్థులు కోరకూడదని ధర్మాసనం చెప్పింది.

# ఏపీ ప్రభుత్వ తీరుపై మరోసారి విరుచుకుపడ్డ పవన్

అమరావతి : జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ ఏపీ ప్రభుత్వ తీరుపై మరోసారి విరుచుకుపడ్డారు. అధికారంలో ఉన్న మంత్రుల వ్యాఖ్యలు, ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే అన్నపూర్ణ లాంటి కోనసీమలో క్రాప్ హాలీడే పరిస్థితి వచ్చిందని మండిపడ్డారు. రైతులు తమ గోడును వెల్లబుచ్చుకుంటుంటే వైసీపీ నాయకులు రైతులపైనే విమర్శలు చేస్తున్నారని పేర్కొన్నారు. టెన్త్‌లో విద్యార్థులు ఫెయిల్ అయితే తల్లిదండ్రుల మార్గనిర్దేశం సరిగా లేదని ఆరోపించడం బాధకరమని అన్నారు.అత్యాచారాలు జరిగితే తల్లి పెంపకం సరిగా లేదని విమర్శలు చేశారని ఆరోపించారు. హామీలు నెరవేర్చాలని ఉద్యోగులు రోడ్డెక్కితే బాధ్యతలేదని వ్యాఖ్యలు చేయడం బాధ్యతరాహిత్యానికి నిదర్శనమని వివరించారు. రాష్ట్రంలో ఏ సమస్య వచ్చినా రాజకీయంగా విమర్శించడమే తప్ప వాటిని పరిష్కరించే ధోరణి ప్రభుత్వం వద్ద లేదని అన్నారు. రైతులకు న్యాయం జరిగే వరకు జనసేన పోరాటం చేస్తుందని పవన్ స్పష్టం చేశారు.



# సంపాదకీయం

శనివారం 11-06-2022

## కమలంలో ముసలం...

ధానమంత్రి నరేంద్ర మోడీ తిరుగులేని నాయకుడు, ఎనిమిదేళ్ళ పాలన తర్వాత కూడా దేశంలో మోడీకి సరి జోడీ మరొకరు కనిపించడం లేదు. ఇది చాలా మందిలో ఉన్న ప్రస్తుతఅభిప్రాయం. అలాగే, పార్టీలో ప్రభుత్వంలో అయన మాటకు ఎదురుండదు. అటు పార్టీలో, ఇటు ప్రభుత్వంలో మోడీ, షా జోడీదే హావా. ఆ ఇద్దరు ఏ నిర్ణయం తీసుకుంటే, అదే ఫైనల్..నిజమే,కొంచెం అతిశయోక్తిగా అనిపించినా ఇదే నిజం.ముఖ్యంగా, 2019లో రెండవ సారి, 303 మంది సభ్యుల సొంత సంఖ్యాబలంతో అధికారంలోకి వచ్చిన తర్వాత, పార్టీలో, ప్రభుత్వంలో ఆ ఇద్దరే హీరోలు .. మిగిలిన అందరూ జీరోలు, అనే అభిప్రాయం మరింతగా బలపడింది. బీజేపీ అంటే మోడీ, బీజేపీ అంటే అమిత్ షా, ప్రభుత్వంలోనూ ఆ ఇద్దరు చెప్పిందే వేదం, ఎంత మంది సీనియర్ మంత్రులు ఉన్నా, ఆ ఇద్దరు చేసిందే శాసనం, అనే ఒక బలమైన పర్సెప్షన్ అయితే ఏర్పడింది. సహజంగానే అది సీనియర్లలో అసంతృప్తిని రగిల్చింది. నిజమే ఒకప్పుడు, కాంగ్రెస్ లో ఇందిరా గాంధీ ఇలాగే, ఓ వెలుగు వెలిగారు 1969లో సీనియర్ నాయకులు అందరినీ పక్కకు నెట్టి, ఇందిరాగాంధీ పార్టీని రెండు ముక్కలు చేశారు. అయినా 1971 లో జరిగిన లోక్ సభ ఎన్నికల్లో, ఇందిరా గాంధీ, 353 సీట్లతో తిరుగులేని శక్తిగా, ఎదురు లేని నాయకురాలుగా నిలిచారు. ఈ నేపధ్యంలోనే పార్టీ నాయకుడు దేవకాంత్ బారువా ఇందిరా గాంధీని పొగడ్తలతో ముంచెత్తారు. ఏకంగా, 'ఇందిరానే ఇండియా, ఇండియానే ఇందిరా' అని ఆమెను ఆకాశానికి ఎత్తేశారు. ఇప్పుడు, మోడీ షా జోడీ కూడా అలానే పార్టీని, ప్రభుత్వాన్ని తమ గుప్పిటలో పెట్టుకుని చక్రం తిప్పుతున్నారు. అయితే, ఇప్పుడు ఇటు పార్టీలో, అటు ప్రభుత్వంలో కూడా, మోడీ షా జోడీకి ప్రతిఘటన మొదలైందని తెలుస్తోంది. నిరసన సెగ ఆ ఇద్దరినీ గట్టిగా తాకుతోందని, పార్టీ వర్గాల్లో ప్రముఖంగా వినిపిస్తోంది. అది కూడా నాగపూర్ సెగ అంటున్నారు. పార్టీ సర్వోన్నత విధాన నిర్ణాయక కమిటి, పార్లమెంటరీ బోర్డును నిర్వీర్యం చేసి, ముఖ్యమంత్రుల నియామకం వంటి కీలక నిర్ణయాలను ఆ ఇద్దరే, (మోడీ, షా జోడీ) తీసుకోవడం, ఏమిటనే ప్రశ్న ప్రముఖంగా వినిపిస్తోంది.అదే విధంగా, పార్టీతో సంఘ్ పరివార్ సంస్థలతో సంప్రదించకుండా, హిదుత్వ వాదానికి కట్టుబడిన, పార్టీ అధికార ప్రతి నిధి నూపూర్ ' ను సస్పెండ్ చేయడం వంటి నిర్ణయాలు నాగపూర్ కు రుచించడం లేదని అంటున్నారు. ఈ నేపధ్యంలో, పార్టీ సీనియర్ నాయకుడొకరు, గడచిన రెండు సంవత్సరాలలో, పార్లమెంటరీ బోర్డు ఒక్కసారి కూడా సమావేశం కాలేదు, అయినా, నాలుగైదు రాష్ట్రాలలో ముఖ్యమంత్రులను మార్చారు. ఇటీవల ఎన్నికలు జరిగిన ఉత్తర ప్రదేశ్, ఉత్తరాఖండ్, గోవా, మణిపూర్ రాష్ట్రాలలో ఉన్న ముఖ్యమంత్రులనే కొనసాగించాలననే కీలక నిర్ణయాలు తీసుకున్నారు.ఈ నిర్ణయాలు ఎవరు తీసుకున్నారు? పార్లమెంటరీ బోర్డులో సభ్యులుగా ఉన్న అరుణ్ జైట్లీ, సుష్మ స్వరాజ్ చనిపోయారు. వెంకయ్య నాయుడు ఉప రాష్ట్రపతిగా ఎన్నికై రాజకీయ క్షేత్రం నుంచి తప్పుకున్నారు అలాగే గడచిన ఐదేళ్లలో ఇంకొన్ని ఖాళీలు కూడా ఏర్పడ్డాయి. బోర్డ్ సభ్యుల సంఖ్య ఇంచు మించుగా సగానికి తగ్గి పోయింది. ముఖ్యంగా ప్రశ్నించే వారు లేకుండా పోయారు. ఒక్క గడ్గరీ మినహా మరొకరు గొంతు వినిపించే పరిస్థితి లేదు. అయినా ఖాళీలు భర్తీ చేయలేదు. చివరకు పార్టీ రాజ్యాంగం అత్యున్నత నిర్ణాయక కమిటీగా పేర్కొన్న, పార్లమెంటరీ బోర్డును, కేవలం కాగితాలకు పరిమితం చేశారు, అంటూ ఆగ్రహం వ్యక్త పరిచారు.ఇదలా ఉంటే, ఇటీవల మూడో సారీ, మళ్ళీ నేనే, అంటూ ప్రధాని మోడీ ప్రకటించిన నేపధ్యంలో, పార్టీలో, సంఘ పరివార్' లో లుకలుకలు మొదలయ్యాయని విశ్వసనీయ వర్గాల ద్వారా తెలుస్తోంది. నాగపూర్'కు ఫిర్యాదులు చేరాయి. కొందరు పార్టీ సీనియర్ నాయకులు, ఎంపీలు, పార్టీలో వ్యక్తీ ఆరాధన ఎక్కువుతున్న తీరును, ఆ ఇద్దరు తీసుకుంటున్న ఏకపక్ష నిర్ణయాల వలన పార్టీకి జరుగతున్న నష్టాన్ని నేరుగా ఆర్ఎస్ఎస్ అధినేత మోహన్ భగవత్ దృష్టికి తీసుకెళ్ళారని తెలుస్తోందని అంటున్నారు. ఆ ఇద్దరిని కట్టడి చేయక పోతే. 2024 ఎన్నికలలో పార్టీకి ఓటమి తప్పదని, సుమారు 150కి పైగా ఎంపీల సంతకాలతో కూడిన నివేదిక మోహన్ భగవత్'కు చేరిందని సమాచారం.ఇందులో ప్రధానంగా పెట్రోల్, డీజిల్ సహా నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదల, రైతులు, గ్రామీణ ప్రాంత ప్రజలు, వ్యవసాయ రంగం ఎదుర్కుంటున్న సమస్యలను పట్టించుకోక పోవడం వంటి కీలక అంశాలను ప్రస్తావించినట్లు తెలుస్తోంది.అలాగే, మిత్ర పక్షాలను, ముఖ్యంగా శివసేన వంటి మిత్ర పక్షాలను దూరం చేసుకోవడం, ఆ పార్టీ నేతలను వేధింపులకు గురిచేయడం, ప్రాంతీయ పార్టీలతో కయ్యానికి కలుదువ్వడం వంటి విషయాలను కూడా ఆర్ఎస్ఎస్ అధినేత దృష్టికి తీసుకువెళ్ళినట్లు సమాచారం. ఇటీవల ప్రధాని నరేంద్ర మోడీ, ఆర్ఎస్ఎస్ అధినేత ఆదేశాల మేరకు, సీనియర్ మంత్రులు, కీలక నేతలతో సమావేశ మయ్యారు. ఈ సమావేశంలో, సీనియర్ మంత్రులు రాజనాథ్ సింగ్, నితిన్ గడ్గరీ ప్రధాని మోడీ వ్యవహార శైలిని ప్రశ్నించడం తో పాటుగా తీరు మార్చుకోక పోతే, 2024 ఎన్నికలలో గట్టెక్కడం కష్టమని గట్టిగా హెచ్చరించారని తెలుస్తోంది. ఈ సందర్భంగా గడ్గరీ, ప్రధాని మోడీ మధ్య వాగ్వివాదం సైతం చోటు చేసుకుందని, ఆ సమయంలో మోడీ 'ఎన్నికలలో ఎలా గెలవాలో , ఎప్పుడు ఏ నిర్ణయం తీసుకోవాలో తనకు తెలుసునని, ఎవరూ చెప్పవలసిన అవసరం లేదని అసహనాన్ని ప్రదర్శించారు. అలాగే ఎంపీలు అందరూ తనతోనే ఉన్నారని అన్నారు,దీంతో గడ్గరీ 150 మంది ఎంపీలు సంతకాలతో నాగపూర్'కు పంపిన నివేదికను మోడీ ముందు పెట్టినట్లు సమాచారం.ఆ తర్వాతనే మోడీ, పెట్రోల్, డీజిల్'పై ఎక్సైజ్' డ్యూటీ భారీగా తగ్గించడం,ఎరువుల సబ్సిడీ పెంచడం వంటి నిర్ణయాలు తీసుకున్నారని తెలుస్తోంది. అలాగే, మిత్రపక్షాల విషయంలోనూ పునరాలోచన చేస్తునట్లు తెలుస్తోంది. అయితే, ముడో సారీ నేనే. అంటూ మోడీ చేసిన ప్రకటన సృష్టించిన ప్రకంపనలు అంత తేలిగ్గా చల్లారవని, ముఖ్యంగా ప్రధాని పదవిని ఆశిస్తున్న, ఆర్ఎస్ఎస్ ఆశీస్సులు ఉన్న గడ్గరీ, ఈసారి తాడో పేడో తేల్చుకునేందుకు సిద్ధమయ్యారని అంటున్నారు.అయితే, అదే సమయంలో మోడీ షా జోడీ వ్యూహాలను తక్కువగా అంచనా వేయలేమని, కమల దళంలో విరిసిన 'ముసలం' ఏమి చేస్తుందో, ఎటుగా సాగుతుందో చూడవలసిందే కానే చెప్పలేమని, పార్టీ నేతలు, పరిశీలకులు అంటున్నారు. అయితే, బీజేపీ అంతా బాగుందని, మోడీ షా జోడీకి తిరుగు లేదని, అనుకునే పరిస్థితి అయితే లేదని తాజా పరిణామాలు సూచిస్తున్నాయని, పార్టీ నాయకులే అంగీకరించడం ... ఈ కథకు కొసమెరపు.

## ఆకట్టుకుంటున్న విలాసాల నౌక..



విశాఖపట్టణం, జూన్ 10, సముద్ర విహారానికి వెళ్లాలని ఎదురు చూస్తున్న వారికి ఇదో సదావకాశం..నిజంగా చెప్పాలంటే, గుడ్‌న్యూస్ అనాలి. ఎందుకంటే, సాగర తీరంలో ఇప్పుడు లగ్జరీ షిప్ మీకోసమే వెయిట్ చేస్తోంది. సముద్రపు అలలపై తేలియాడుతూ కుటుంబసభ్యులతో సరదాగా గడిపే అద్భుత అవకాశం పర్యాటకులకు దక్కనుంది. సకల సౌకర్యాలతో కూడిన భారీ క్రూయిజ్ షిప్ ఎంప్రెస్ ఇప్పుడు విశాఖకు చేరుకుంది. ఈ క్రూయిజ్.. విశాఖపట్నం, పుదుచ్చేరి, చెన్నై వరకు వెళ్లి.. తిరిగి వైజాగ్ చేరుకుంటుంది.. కార్డీలియా క్రూయిజ్ కంపెనీ నడిపే ఈ షిప్.. సముద్రంలో తేలియాడే స్టార్ హోటల్‌ను తలపిస్తుంది. చెన్నై నుంచి విశాఖ చేరుకున్న కార్డీలియా క్రూయిజ్.. మూడు రాత్రులతో నాలుగు రోజుల టూర్ ప్యాకేజీని ఆఫర్ చేస్తోంది. ఈ క్రూయిజ్ షిప్ విశాఖకు చేరుకున్న సందర్భంగా బ్యాండ్ మేళాలతో ప్రయాణికులకు ఘన స్వాగతం పలికారు.విలాసవంతమైన విహార నౌక 'కార్డేలియా' బుధవారం ఉదయం విశాఖ పోర్టుకు వచ్చింది. నగరవాసులు క్రూయిజ్ లో ప్రయాణం చేసేందుకు ఉత్సాహం చూపడంతో టికెట్లు హాట్ కేకుల్లా అమ్ముడయ్యాయి. పూర్తిగా భారత జలాల్లోనే విశాఖ-పుదుచ్చేరి-చెన్నై-విశాఖ మార్గంలో తొలిసారిగా కార్డేలియా ప్రయాణిస్తుంది.స్టార్ హోటల్‌కు మించిన సౌకర్యాలతో పర్యాటకులను అలరిస్తోంది. 796 క్యాబిన్లు, 313 ఇన్‌సైడ్ స్టేట్ రూమ్స్, 414 ఓషన్ వ్యూ రూమ్స్, 63 బాల్కనీ రూమ్స్, 5 సూట్ రూమ్‌లతో పాటు ఒక లగ్జరీ సూట్ రూమ్, ఫుడ్ కోర్టులు, 3 స్పెషాలిటీ రెస్టారెంట్లు, 5 బార్లు, స్పా, సెలూన్, థియేటర్, నైట్ క్లబ్, స్విమ్మింగ్ పూల్స్, ఫిట్‌నెస్ సెంటర్లు, డీజే ఎంటర్‌టైన్‌మెంట్, లైవ్ బ్యాండ్, అడ్వెంచర్ యాక్టివిటీస్, షాపింగ్ మాల్స్, లైవ్‌షోలు ఇలా సకల సౌకర్యాలతో ప్రయాణికుల కోసం అందుబాటులో ఉంది. ఇక ఇందులో సూర్యోదయం, సూర్యాస్తమయం చూసేందుకు ప్రత్యేక డెక్ ఏర్పాటు చేసారు. అక్కడి నుంచి సాగర అందాలు చూడటం ప్రత్యేక అనుభూతి అనే చెప్పాలి. 1900 మంది వరకూ ప్రయాణించగలిగే ఈ నౌకలో విశాఖ నుంచి చెన్నై వెళ్లేందుకు 36గంటల సమయం పడుతుంది.విశాఖ నుంచి రాత్రి ఎనిమిది గంటలకు బయలుదేరి తొమ్మిదో తేదీ మొత్తం సముద్రంలోనే ప్రయాణిస్తుంది. 10 వ తేదీ ఉదయం ఏడు గంటలకు పుదుచ్చేరి చేరుకుంటుంది. పుదుచ్చేరిలో రాత్రి ఏడు గంటల వరకు పర్యటించవచ్చు. ఆయా ఏర్పాట్లు కూడా సంస్థే చేస్తుంది. పుదుచ్చేరి లో రాత్రి ఏడు గంటలకు బయలుదేరి మరుసటి రోజు (నాలుగో రోజుకు) చెన్నై కు చేరుకుంటుంది. ఎంప్రెస్ విదేశీ విహార నౌక అయినప్పటికీ దీన్ని ప్రస్తుతం భారత దేశంలో మాత్రమే తిరిగేలా నిర్వాహకులు అనుమతులు పొందారు. దీంతో పాస్‌పోర్ట్ అవసరం లేదు. కస్టమ్స్ తనిఖీలు ఉండవు.విశాఖ నౌకాశ్రయానికి గతంలో కూడా కొన్ని నౌకలు వచ్చినా ప్రస్తుతం ఈ నౌకకు కొన్ని ప్రత్యేకతలు ఉన్నాయంటున్నారు. ఇంటీరియర్ స్టాండర్డ్ రూం, ఓషన్ వ్యూ స్టాండర్డ్ రూం, మినీ సూట్ రూం, సూట్ రూం పేరిట నాలుగు విభాగాలు నౌకలో ఉన్నాయి. ఒక్కో విభాగానికి ఒక్కో ధరను నిర్ణయించారు. అదే నౌక జూన్ 15 న, 22 వ తేదీన కూడా వస్తుంది. భారత సాగర తీరాల్లో మాత్రమే తిరిగే విహార నౌక కావడంతో అందులోని పర్యాటకులలో దాదాపు అందరూ భారతీయులే ఉంటారు. టికెట్ల విక్రయాలతో నౌకాశ్రయానికి సంబంధం లేదని విశాఖ నౌకాశ్రయం అధికారులు వెల్లడించారు.

## హంగులు దిద్దుకున్న వైజాగ్ ఎయిర్‌పోర్టు




విశాఖపట్టణం, జూన్ 10, విశాఖపట్నం అంతర్జాతీయ విమానాశ్రయం.. ఇండియన్ నేవీ విమానాశ్రయం ఐఎన్ఎస్ డేగాలో పౌర విమానయాన సేవలందిస్తోంది. మొత్తం 349.39 ఎకరాల విస్తీర్ణంలో విమానాశ్రయం విస్తరించి ఉంది. దేశంలో ఎక్కడా లేని ఒక ప్రత్యేకమైన గుర్తింపు విశాఖ అంతర్జాతీయ విమానాశ్రయానికి ఉంది.సాధారణంగా దాదాపు ప్రతి విమానాశ్రయంలోనూ రన్‌వేకు రెండు వైపుల నుంచి టేకాఫ్, ల్యాండింగ్స్ జరుగుతుంటాయి. కానీ విశాఖలో మాత్రం విమానాశ్రయానికి ఓవైపు పెద్ద కొండ ఉండటం వల్ల ఒకవైపు నుంచి మాత్రమే రాకపోకలు సాగుతున్నాయి. 1981లో రోజుకు ఒక విమానం ద్వారా ప్రారంభమైన పౌర సేవలు ప్రస్తుతం సుమారు 70 వరకు చేరుకున్నాయి. అయితే కోవిడ్ కారణంగా కేవలం 14 సర్వీసులు మాత్రమే ప్రస్తుతం నడుస్తున్నాయి. భవిష్యత్తులో రాకపోకలు పెంచేందుకు విస్తరణ పనులు చేపట్టారు. బ్రిటిష్ కాలంలో 4 పార్కింగ్ బేస్ ఉండేవి. తరువాత మరో 6 పార్కింగ్ బేస్‌లు నిర్మించారు. గతంలో ఉండే రన్‌వే వినియోగించే అవకాశం లేదు. ఇప్పుడు ఒకే రన్‌వే ఉంది. దాన్ని నేవీతో సంయుక్తంగా వినియోగిస్తున్నారు. రన్‌వేపై వెళ్లేందుకు ఎవరికీ అనుమతి లేదు. నేవీ టవర్ కంట్రోల్ రూమ్‌తో రన్‌వేను అనుసంధానం చేశారు. ఎవరైనా రన్‌వే పైకి వెళ్లాలంటే రక్షణ దళ అనుమతి తప్పనిసరి. యాప్రాన్, హ్యాంగర్స్, టెర్మినల్‌కు రన్‌వేలో ఉన్న విమానంతో అనుసంధానమయ్యేలా ఉండే ట్యాక్సీ వేలు కూడా నేవీ భాగంలోనే ఉన్నాయి. అందుకే ప్రత్యేకంగా మరో కొత్త ట్యాక్సీ ట్రాక్ నిర్మించారు. దీనికితోడు తాజాగా మరో ఆరు పార్కింగ్ బేస్‌ల నిర్మాణం కూడా పూర్తయింది. ఇవి త్వరలోనే ప్రారంభించనున్నారు. ఇవి కూడా అందుబాటులోకి వస్తే మొత్తం 16 విమానాలు ఏక కాలంలో రాకపోకలు సాగించే అవకాశాలున్నాయి. అంతర్జాతీయ స్థాయి సదస్సులకు వేదికగా విశాఖ నిలుస్తోంది. దీనికితోడు రాష్ట్ర కార్యనిర్వాహక రాజధానిగా కొత్త రూపుదాల్చనుంది. దీనికితోడు కొత్త రైల్వే జోన్, పోర్టులు, జలరవాణా, జాతీయ రహదారులు ఇలా విశిష్ట సామర్థ్యమున్న విశాఖకు కాలానుగుణంగా కనెక్టివిటీ పెరగాల్సి ఉంది. అయితే నేవీ ఇచ్చిన స్లాట్స్ ప్రకారం 85 విమానాల కంటే ఎక్కువ నడపలేని పరిస్థితి ఉంది. ఈ స్లాట్ పెరగాలంటే.. లిమిటేషన్ పెంచాలి. అది పెరగాలంటే రన్‌వే హ్యాండ్లింగ్ కెపాసిటీ పెంచాలి, ఆక్యుపేషన్ టైమ్ తగ్గించాలి. రన్‌వే ఎఫిషియన్సీ పెంచాలి. ఇది పెరిగితే ప్రస్తుతం ఉన్న గంటకు 10 రాకపోకల స్లాట్‌లో పాసింజర్ విమానాల సామర్థ్యం 16కి పెరుగుతుంది.

## కిసాన్ రైలుతో కాసులు



విజయనగరం, జూన్10, ఆరుగాలం కష్టం పడి పండించిన మామిడి పంటకు గిట్టుబాటు ధర దక్కని రైతులకు కిసాన్ రైలు అక్కరకు వస్తోంది. మార్కెట్ సదుపాయం లేకపోవడంతో పంటను అమ్ముకోవడానికి అన్నదాత దళారులను ఆశ్రయించాల్సి వస్తోంది. రైతులను ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం కిసాన్ రైలును ప్రారంభించింది. రవాణా ఛార్జీల్లో రూ.50శాతం రాయితీ కల్పించారు. వాస్తవానికి ఆ రాయితీ కూడా రైతులకు అందలేదు. గిటుబాటు ధరరాక, రవాణా రాయితీ లభించిక రైతన్న నిండా మునిగిపోతున్నాడు.. ప్రభుత్వం తమ గోస చూసైనా పంట కొనుగోలు చేసి ఆదుకోవాలని మామిడి రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.మామిడి ఉత్పత్తిలో రాష్ట్రంలో విజయనగరం జిల్లా మూడో స్థానం. సుమారు 1.10 లక్షల ఎకరాల్లో సువర్ణరేఖ, బంగినపల్లి, పనుకులు, పరియాలు, రసాలు, కోలంగోవ, కలెక్టేర్ తదితర రకాల మామిడి కాయలు సాగవుతున్నాయి. వీటిలో పనుకులు, పరియాలు, సువర్ణరేఖ, బంగినపల్లి అధికంగా సాగువుతుంది.గతేడాది ఎకరాకు ఐదు టన్నుల దిగుబడి వచ్చింది. ఈ ఏడాది వాతావరణం అనుకూలించకపోడంతో పూత దశలోనే నష్టం రావడంతో ఎకరాకు రెండు టన్నుల దిగుబడి వచ్చింది. తీరా పంటను అమ్ముకుందామనుకున్న సమయంలో కరోనా రెండోదశ వచ్చి పడింది. దీంతో పలు రాష్ట్రాలు లాక్‌డౌన్, కర్ఫ్యూ విధించడంతో ఎగుమతులు నిలిచిపోయాయి. ఇదే అదునుగా భావించిన స్థానిక దళారులు తక్కువ ధరకు మామిడిని కొనుగోలు చేస్తున్నారు. ఈ పరిస్థితిలో మామిడిరైతులను ఆదుకునే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం కిసాన్‌రైలును ప్రవేశపెట్టింది. ఢిల్లీలోని అజాపూర్ మార్కెట్‌కు పంటను తరలిస్తుంది. రవాణా ఛార్జీల్లో రూ.50 శాతం రాయితీని కల్పిస్తారు. ఏప్రిల్ నుంచి మే మొదటి వారం వరకు పదివేల మెట్రిక్ టన్నులు ఎగుమతి చేశారు. కానీ, కేంద్రం మే నెల రెండో వారంలో రవాణా రాయితీ ప్రకటించింది. దీనివల్ల అప్పటికే ఎక్కువ మంది రైతులు తమ సరుకును దళారులు విక్రయించారు. రవాణా ఛార్జీలు కూడా వారికే లభించాయి. ఇటు గిట్టుబాటు ధర లభించక, కేంద్రం ఇస్తున్న రవాణా ఛార్జీలు అందక అన్నదాత తీవ్రంగా నష్టపోతున్నాడు. స్థానిక మార్కెటులు ఏర్పాటు చేసి తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.కరోనాను బూచిగా చూపి దళారులు రూ.1000 నుంచి రూ.1200 విలువ చేసే సువర్ణరేఖ 16 కేజీల బాక్సును రూ.800మించి కొనుగోలు చేయడం లేదు. మే నెల ఆరంభం నాటికి గరిష్టంగా రూ.500కు తగ్గించారు. రూ.1000 విలువ చేసే బంగినపల్లి ఏప్రిల్‌లో గరిష్టంగా రూ.600, మే నెలలో రూ.400కు తగ్గించి కొనుగోలు చేశారు. ఇక కోలంగోవ, కలెక్టర్ వంటి రకాలు విక్రయించే రైతులకు తిరిగి నష్టం వస్తుంది.నాలుగైదేళ్లగా నాతోపాటు మామిడి రైతులంతా నిలువ దోపిడీకి గురౌతున్నారు. సాగుతోపాటు పక్వానికి వచ్చిన కాయలు కోసి, వాటిని బాక్సుల్లో విక్రయించే క్రమంలో రూ.లక్షల్లో పెట్టుబడి పెడుతున్నాం. కానీ, స్థానికంగా మార్కెటింగ్ సదుపాయం లేకపోవడంతో దళారులకు విక్రయించాల్సివస్తోంది. గతంలో కొంత నయం. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన 50శాతం రవాణా ఛార్జీ వల్ల రైతులకు ఒరిగిందేమీ లేదు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే స్థానికంగా ప్రభుత్వ మార్కెట్ సదుపాయం కల్పించాలి.

## కంచుకోటకు బీటలు

ఏలూరు, జూన్ 10, పశ్చిమ గోదావరి జిల్లా ఉండి నియోజకవర్గం టీడీపీకి కంచుకోట. ఆ పార్టీ ఆవిర్భావించక ఇక్కడ ఒక్కసారే ఓటమి పాలైంది. 1983 నుంచి 2019 వరకు చూసుకుంటే టీడీపీ కేవలం 2004 ఎన్నికల్లోనే ఓడిపోయింది. మిగిలిన 8 సార్లు ఉండి నియోజకవర్గంలో టీడీపీ జెండానే ఎగిరింది. రాష్ట్రంలో జగన్ గాలి బలంగా ఉన్నా సరే 2019 ఎన్నికల్లో ఉండిలో మాత్రం టీడీపీ గెలిచింది. దీనిని బట్టే ఉండి టీడీపీ ఎంత కంచుకోటో తెలుస్తోంది. వైఎస్ ప్రభంజనం అయినా.. జగన్ సునామీ అయినా ఉండిలో సైకిల్ సత్తా చెక్కు చెదర్లేదు. ఇక్కడ గత ఎన్నికల్లో టీడీపీ తరపున మంతెన రామరాజు విజయం సాధించారు. అయితే తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచిన రాంబాబు, కాస్త సైలెంట్‌గానే పనిచేసుకుంటూ వెళుతున్నారు. నియోజకవర్గంలో ప్రజలకు అందుబాటులోనే ఉంటున్నారు.అదే సమయంలో ప్రతిపక్ష ఎమ్మెల్యేగా ఉంటూ, అధికార వైసీపీపై దూకుడుగా వెళ్ళడం లేదు. ఇటు టీడీపీలో ఉంటూనే, అటు వైసీపీతో కూడా మంచిగానే ఉంటున్నారు. ప్రభుత్వంపై దూకుడుగా విమర్శలు చేయడం లేదు. నియోజకవర్గంలో పనులు చేయించుకోవడానికి జిల్లాలోని వైసీపీ నేతలతో సఖ్యతతోనే ఉంటున్నారన్న ప్రచారం స్థానికంగా టీడీపీ వర్గాల్లోనే వినిపిస్తోంది. గత ఎన్నికల్లో ఎమ్మెల్యే సీటు ఇస్తామని టీడీపీ ఆఫర్ చేయడంతో ఆర్థికంగా భారీ రిస్క్ చేసే రాంబాబు గెలిచారు. అయితే ఇప్పుడు ప్రభుత్వంతో సై అనేలా వ్యవహరిస్తే ఆయన వ్యాపారాలకు కూడా పెద్ద రిస్కే అన్న నిర్ణయానికి ఆయనే వచ్చేశారట.జిల్లాలో తన సామాజిక వర్గానికే చెందిన మంత్రి రంగరాజుతో లోపాయికారిగా సఖ్యతతో ఉంటున్నట్టు కూడా వార్తలు గుప్పుమంటున్నాయి. అయితే ఇలా కర్ర విరగకూడదు?పాము చావు కూడదు అన్న చందంగా నడుస్తున్న రాంబాబుకు నెక్ట్స ఎన్నికల్లో ఉండి సీటు దక్కుతుందా లేదా అనేది కాస్త డౌట్‌గానే ఉంది. ఎందుకంటే 2009, 2014 ఎన్నికల్లో ఉండి నుంచి వేటుకూరి శివరామరాజు(కలవపూడి శివ) టీడీపీ తరుపున గెలిచారు. ఇక 2019 ఎన్నికల్లో రాజకీయ సమీకరణాల్లో భాగంగా చంద్రబాబు, శివని నరసాపురం ఎంపీగా బరిలో దించారు. ఇక శివకు సోదరుడు వరుసయ్యే రాంబాబుని ఉండిలో నిలబెట్టారు.ఇక జగన్ వేవ్‌లో శివ ఓటమి పాలయ్యారు. ఈయనపై రఘురామకృష్ణంరాజు విజయం సాధించారు. అయితే ఓడిపోయిన దగ్గర నుంచి శివ పొలిటికల్ స్క్రీన్‌పై కనిపించడం లేదు. సొంత వ్యాపారాలు ఉండటంతో సైలెంట్‌గా ఉంటున్నట్లు తెలుస్తోంది. అయితే వచ్చే ఎన్నికల్లో శివ మళ్ళీ ఉండి నియోజకవర్గం నుంచి టీడీపీ తరుపున ఎమ్మెల్యేగానే పోటీ చేస్తానని చెప్పేశారని తెలుస్తోంది. శివకు మళ్ళీ నరసాపురం నుంచి పోటీ చేసే ఉద్దేశం లేదన్నది క్లారిటీ వచ్చేసింది. శివ వస్తే రాంబాబు సైడ్ అవ్వాల్సిందే. మరి చంద్రబాబు ఆ ఇద్దరి నేతలకు ఎలా న్యాయం చేస్తారో చూడాలి. ఏదేమైనా ఉండి టీడీపీలో ఈ ఇద్దరు నేతల రాజకీయం కొత్తగా మారేలా కనిపిస్తోంది.

## కిం.. కర్తవ్యం... ఇద్దరు నేతల దారెటు

ఏలూరు, జూన్ 10, పీతల సుజాత.. కొత్తపల్లి జవహర్. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన ఈ ఇద్దరు టీడీపీ నేతలు గతంలో మంత్రులుగా పనిచేశారు. 2014లో చింతలపూడి నుంచి సుజాత, కొవ్వూరు నుంచి జవహర్ ఎమ్మెల్యేలుగా గెలిచారు. ఈ రెండు నియోజకవర్గాల్లో ఇద్దరూ స్థానికేతరులైనప్పటికీ.. అక్కడ టీడీపీకి బలం ఉండటంతో అసెంబ్లీలో ఆనాడు ఈజీగానే అడుగు పెట్టేశారు. గత ప్రభుత్వంలో ముందుగా సుజాత.. తర్వాత జవహర్ కేబినెట్ మంత్రులయ్యారు. గెలిచిన కొత్తలో బాగానే ఉన్నా.. మంత్రులయ్యాక నియోజకవర్గాల్లో గ్రూపు తగాదాలు పెరిగిపోయాయి. తగాదాలను పరిష్కరించకుండా.. ఆధిపత్య ధోరణి ప్రదర్శించడంతో ఇద్దరికీ మొదటికీ మోసం వచ్చిందని ఇప్పటికీ చెబుతారు.2019 ఎన్నికల నాటికి వర్గపోరు తీవ్రం కావడంతో అది అభ్యర్థుల ఎంపికపైనా ప్రభావం చూపించింది. చివరకు పీతల సుజాతకు చింతలపూడి టికెట్ ఇవ్వలేదు టీడీపీ అధిష్ఠానం. జవహర్‌ను కొవ్వూరు నుంచి తిరువూరుకు పంపింది పార్టీ. ఈ మార్పులు చేసినప్పటికీ రెండు నియోజకవర్గాల్లో టీడీపీకి కలిసి రాలేదు. అప్పటి నుంచి చింతలపూడి, కొవ్వూరుల్లో పార్టీ కేడర్‌ను అంటిపెట్టుకున్న నాయకులే కరువయ్యారు. వచ్చే ఎన్నికల్లో ఇక్కడి నుంచి పోటీ చేయడానికి టీడీపీలో ఆశావహుల సంఖ్య పెరిగింది. అయినప్పటికీ పోయిన చోటే వెతుక్కోవాలని సుజాత, జవహర్ చూస్తున్నారట.చింతలపూడిలో సుజాత, కొవ్వూరులో జవహర్ మరోసారి చురుకుగా పావులు కదుపుతున్నారు. గతంలో అధికారంలో ఉన్నప్పుడు తయారు చేసుకున్న అనుచరులతో మళ్లీ టచ్‌లోకి వెళ్తున్నారట. అసంతృప్త నాయకులను ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డారట నాయకులు. అవకాశం చిక్కితే తాము కేడర్‌కు అందుబాటులో ఉన్నామనే సంకేతాలను అధినేత దృష్టికి వెళ్లేలా తెగ పాట్లు పడుతున్నారట. పనిలో పనిగా వచ్చే ఎన్నికల్లో తమకు ఆర్థికంగా సాయం చేసేవారి వేటలోనూ పడ్డారట మాజీ మంత్రులు. వీరి ఫీట్లు చూశాక.. ఇప్పుడీ పాట్లు ఎందుకు.. అందరితో అప్పుడే సఖ్యతగా ఉంటే పోయేదిగా అని తెలుగు తమ్ముళ్లు వ్యంగ్యాస్త్రాలు సంధిస్తున్నారట.రెండు నియోజకవర్గాల్లోనూ ప్రస్తుతం టీడీపీ కేడర్ అధిష్ఠానం ఆదేశాల కోసం ఎదురు చూస్తోంది. అయితే చింతలపూడి, కొవ్వూరులు ఎస్సీ రిజర్వ్ నియోజకవర్గాలు కావడంతో ఆచితూచి నిర్ణయం తీసుకునే అవకాశం ఉందట. సుజాత, జవహర్‌లు మాత్రం టికెట్ తమకే వస్తుందనే పూర్తి ధీమాతో పర్యటనలు చేస్తున్నారట. కానీ.. మహానాడు వేదికగా చంద్రబాబు చేసిన కామెంట్స్‌ను ఈ సందర్భంగా కేడర్ గుర్తు చేస్తోంది. కష్టపడ్డవారికే పార్టీలో ప్రాధాన్యం ఉంటుందని అధినేత కుండబద్దలు కొట్టారు. ఆ లైన్‌ను ఆధారంగా చేసుకునే సుజాత, జవహర్‌లు పట్టుకోసం ప్రయత్నిస్తున్నట్టు సమాచారం. మరి.. మాజీ మంత్రుల విషయంలో చంద్రబాబు ఆలోచనలు ఎలా ఉన్నాయో? పాత వారికే పిలిచి టికెట్ ఇస్తారో.. కొత్త వారికి పట్టం కడతారో చూడాలి

## వివేకా హత్య కేసులో ఏం జరుగుతోంది...

కడప, జూన్ 10, దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఒక హై ప్రొఫైల్ కేసులోనే సాక్షి అనుమానాస్పద స్థితిలో మరణించడం ఏమిటి? అసలేం జరుగుతోంది ఏపీలో. ఏపీ ముఖ్యమంత్రి జగన్ కు స్వయాన చిన్నాన్న వైఎస్ వివేకానందారెడ్డి హత్య కేసు సీబీఐ దర్యాప్తు చేస్తున్నసంగతి తెలిసిందే. సీబీఐ దర్యాప్తులో పలు సంచలన అంశాలు వెలుగు చూస్తున్న తరుణంలో ఈ కేసులో సాక్షిగా వున్న వ్యక్తి అనుమానాస్పద పరిస్థితుల్లో మృతి చెందడం కలకలం రేపుతోంది. చిత్రమే మంటే సినిమాటిక్‌గా ఆ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మరణించడం. గతంలో పరిటాల రవి కేసులో సాక్షులు వరుసగా ఇలానే మృతి చెందడాన్ని గుర్తు చేస్తూపలువురుకేసు ఎలా సాగుతుందన్న దానిపై సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ కేసు దర్యాప్తు చేస్తున్నసీబీఐ అధికారులకే బెదరింపులు రావడం తెలిసిందే. అసలు రాజకీయ నాయకులకు సంబంధించిన కేసుల్లోనే ఇటువంటి పరిస్థితి గురించి వినడం, చూడటం పోలీసువర్గాల మీద నమ్మకం తగ్గిస్తుంది. మంత్రి వై.ఎస్.వివేకా నంద రెడ్డి హత్యకేసు ఇప్పటికే మలుపులు తిరి గింది. ఇపుడు ఆ కేసుకు సంబంధించిన సాక్షి గంగా ధర్ రెడ్డి బుధవారం రాత్రి మృతి చెందడంతో కేసు మరో కీలక మలుపు తిరిగిందనే అనాలి. అనంతపురం జిల్లా యాడికి కి చెందిన గంగాధర్ తన నివాసంలో మరణించేడు. గురువారం ఉదయం లేవ లేదు. కుటుంబసభ్యులు వైద్యుల్ని సంప్రదించగా అతను పల్స్‌రేట్ పడిపోవడం వల్లనే మరణించినట్లు ప్రకటించేరు. పోలీసులు ఈ మరణం సహజ మరణం కాదని తేల్చేరు. కేసు విషయానికి వస్తే, వివేకానందరెడ్డి హత్య జరిగి మూడేళ్లయింది. కానీ అసలు సూత్రధారలు ఎవరన్న ది సిబిఐ ఇప్పటి వరకూ తేల్చలేకపోయింది. ఈ కేసులో వివేకా మాజీ కారు డ్రైవర్ దస్తగిరి అప్రూవర్‌గా మారాడు. అప్పటి నుంచి తన ప్రాణాలను కాపాడాలని పోలీసులకు మొరపెట్టుకుంటూనే వున్నాడు. ఏ క్షణాన తనకు ఏమవుతుందోనన్న భీతిలోనే బతుకుతున్నాడు. పోతే, ఈ కేసు దర్యాప్తు చేస్తున్న సీబీఐ అధికారు లపై ఉల్టా కేసు పెట్టడమేకాకుండా, వారి డ్రైవర్‌నీ బెదిరించడం మరీ చిత్రం. సీబీఐ వారు దేన్ని అనుమానించక వదలరు. రెండు రోజుల క్రితమే పులివెందులలోని ఏపీ సీఎం జగన్ క్యాంపు కార్యాలయానికి దగ్గరలోనే వున్న ఎం.పీ అవినాష్ రెడ్డి, వివేకా నివాసంలో, పరిసరాల్లో మళ్లీ తని ఖీలు చేపట్టడమేకాకుండా ప్రభుత్వ సర్వేయర్‌తో నివాసాల కొలతలను తీయించేరు. సీబీఐ దర్యాప్తు కాస్తంత వేగిరంగా కానిస్తోంది అనుకున్నారు. ఇంతలో గంగాధర్ రెడ్డి అసహజ మరణం ప్రాధాన్యత సంతరించుకుంది

## ధ్వజారోహణంతో వైభవంగా ప్రారంభమైన శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాలు

తిరుపతి, జూన్ 10అప్పలాయగుంట శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాలు శుక్రవారం ధ్వజారోహణంతో వైభవంగా ప్రారంభమయ్యాయి. సకల దేవతలను బ్రహ్మోత్సవాలకు ఆహ్వానిస్తూ ఉదయం 10 నుండి 10.20 గంటల వరకు కర్కాటక లగ్నంలో వైఖానసాగమోక్తంగా ధ్వజారోహణ ఘట్టం జరిగింది. వేదపండితుల మంత్రోచ్ఛారణలు, మంగళవాయిద్యాలు, భక్తుల గోవిందనామస్మరణ నడుమ ఈ కార్యక్రమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. అంతకుముందు ఉదయం 8 నుండి 8.30 గంటల వరకు స్వామివారి తిరుచ్చి ఉత్సవం నిర్వహించారు. అనంతరం ధ్వజస్తంభం వద్ద విశేషపూజ కార్యక్రమాలు జరిగాయి. అంతకుముందు భేరితాడనం, భేరీపూజ, ధ్వజపటం, నవసంధి, శ్రీవారి మాడ వీధి ఉత్సవం, ఆస్థానం నిర్వహించారు. ఇందులో వైఖానస శాస్త్రోక్తంగా గరుడ్మంతుణ్ణి నూతన వస్త్రంపై లిఖించి, పూజలు చేసి, ధ్వజస్తంభంపై ప్రతిష్ఠించారు. 18 గణాలను, ముక్కోటి దేవతలను బ్రహ్మోత్సవాలకు ఆహ్వానించడం దీని లక్ష్యం. కంకణభట్టార్ శ్రీ సూర్యకుమార్ ఆచార్యులు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. అనంతరం ఉ దయం 11.30 నుండి మధ్యాహ్నం 12.30 గంటల వరకు స్వామి, అమ్మవార్లకు వేడుకగా స్నపనతిరుమంజనం నిర్వహించారు. ఇందులో పాలు, పెరుగు, తేనె, కొబ్బరి నీళ్ళు, పసుపు, చందనంతో అభిషేకం జరిగింది. సాయంత్రం 6.30 నుండి రాత్రి 7.30 గంటల వరకు ఊంజల్‌సేవ, రాత్రి 8 నుండి 9 గంటల వరకు పెద్ద శేషవాహన సేవ వైభవంగా జరుగనుంది.

## శ్రీ పద్మావతి అమ్మవారిని దర్శించుకున్న సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ

తిరుపతి, జూన్ 10తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారిని శుక్రవారం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ దర్శించుకున్నారు. ఆలయం వద్దకు చేరుకున్నసుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి దంపతులను టీటీడీ ఈవో ఎవి.ధర్మారెడ్డి సాదరంగా అహ్వానించగా, అర్చక బృందం "ఇస్తికఫాల్" ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ఆయన ధ్వజస్తంభానికి నమస్కరించి అమ్మవారిని దర్శించుకున్నారు. దర్శనానంతరం వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. అమ్మవారి వస్త్రం, తీర్థప్రసాదాలను ఈవో అందజేశారు. జిల్లా న్యాయమూర్తులు భీమారావు, వీర్రాజు, తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి, జెఈవో వీరబ్రహ్మం, ఆర్‌డివో కనక నరసారెడ్డి, ఆలయ డెప్యూటీ ఈవో లోకనాథం, విజివో మనోహర్, అర్చకులు బాబుస్వామి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## తెలంగాణలోనే టాప్ టెన్ గ్రామాలు

కోరుట్ల కోరుట్ల నియోజక వర్గంలో పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవ కార్యక్రమంలో మంత్రి కెటిఆర్, రాష్ట్ర రోడ్లు భవనాలు శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి పాల్గోన్నారు. తరువాత కోరుట్ల లో టిఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ హజరు కాగా, మంత్రులు వేముల ప్రశాంత్ రెడ్డి, కొప్పుల ఈశ్వర్,స్థానిక ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు,జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ తదితరులు పాల్గోన్నారు.మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ మనమందరం టిఆర్ఎస్ పార్టీ కుటుంబ సభ్యులుగా ఉ ండడం గర్వ కారణం. టిఆర్ఎస్ పార్టీ అధినేత ముఖ్యమంత్రి కేసిఆర్ చావు నోట్లో తల పెట్టి రాష్ట్రాన్ని సాధించారు. తెచ్చుకున్న తెలంగాణను అతి తక్కువ కాలంలో తలెత్తుకునేల చేశారు. అన్ని రంగాల్లో నేడు దేశంలోనే నెంబర్ వన్ తెలంగాణ. తెలంగాణలోని అభివృధి చూసి పక్క రాష్ట్రాలైన మహారాష్ట్ర, కర్ణాటక, ఛత్తీస్ ఘడ్ ప్రజలు తెలంగాణలో కలపండి అని అడుగుతున్నారు. కర్ణాటక ఎమ్మెల్యేనే స్వయంగా అడిగారు. దేశంలో టాప్ 10 ఆదర్శ గ్రామాలు తెలంగాణ లోనే ఉన్నాయి. బీజేపీ,కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లోని గ్రామాలు ఎందుకు లేవు. రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు బుడ్డర్ ఖాన్ రేవంత్ రెడ్డి,బీజేపీ అధ్యక్షుడు బండి సంజయ్ కుక్కల్లగా మొరుగుతున్నరు. కెటిఆర్ మున్సిపల్,ఐటి శాఖ మంత్రిగా రాష్ట్రానికి వేల పరిశ్రమలు తెచ్చి స్థానిక యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారు. ప్రైవేట్ రంగంలోనే 16 లక్షల ఉద్యోగాలు కల్పించిన ఘనత కెటిఆర్ కే దక్కుతుంది. ఐటి ఎగుమతులు 2014లో 57 వేల కోట్లు ఉంటే నేడు అవి 2లక్షల కోట్లకు పెరిగాయి. ఐటి లో ఉద్యోగాలు 3 లక్షలు ఉంటే నేడు 7లక్షల ఉద్యోగాలు కల్పించబడ్డాయి. హైదరాబాద్ పట్టణంతో పోటీగా పట్టణాలను సుందరంగా తీర్చిదిద్దుతున్నారు.. నా నియోజకవర్గం లోని భీంగల్ ను కొత్తగా మున్సిపాలిటీ చేసి,పట్టణాన్ని సుందరంగా చేసుకునేందుకు మున్సిపల్ మంత్రిగా కెటిఆర్ గారు 25 కోట్లు ఇచ్చారు. మెట్ట చిట్టాపూర్ లో విత్తన కంపెనీలు పెట్టుబడి పెట్టేందుకు ముందుకు వచ్చాయి.నేడు ఎంవోయూ చేసుకున్నాయి. ఇందులో స్థానికులకే 2వేల 200 మందికి ఉపాధి అవకాశాలు రానున్నాయి. తెలంగాణలోని మారు మూల పల్లెకు పరిశ్రమలు తెచ్చిన ఘనత కెటిఆర్ దే. స్వయంగా కంపెనీ వారే చెప్తున్నారు..కెటిఆర్ గారి ప్రోత్సాహం ,ఇచ్చిన ధైర్యం వల్లే ఇక్కడ పరిశ్రమలు నెలకొల్పుతున్నామని. బండి సంజయ్,రేవంత్ రెడ్డి హైదరాబాద్ లో తిరుగుతున్నారు కదా..హైదరాబాద్ లో అభివృద్ది మీ కళ్లకు కన్పిస్తలేదా..? టిఆర్ఎస్ కార్యకర్తలు.. బీజేపీ,కాంగ్రెస్ నాయకుల అబద్ధపు ప్రచారాలకు దీటుగా సమాధానం చెప్పాలి. తెలంగాణ కు టిఆర్ఎస్ పార్టీనే శ్రీరామ రక్ష అన్నారు.

## భక్తజనరంజకం బాలకాండ అఖండ పారాయణం

తిరుమల జూన్ 10ప్రపంచంలోని ప్రజలంతా ఆయురారోగ్యాలతో ఉండాలని శ్రీవారిని ప్రార్థిస్తూ తిరుమల నాదనీరాజనం వేదికపై శుక్రవారం ఉదయం 6.30 నుండి 8.30 గంటల వరకు 9వ విడత బాలకాండ అఖండ పారాయణం భక్తజనరంజకంగా సాగింది.ఇందులో 38 నుండి 43 సర్గల వరకు గల 172 శ్లోకాలను పారాయణం చేశారు. వేద పండితుల అఖండ పారాయణం చేయగా పలువురు భక్తులు భక్తిభావంతో వారిని అనుసరించి శ్లోక పారాయణం చేశారు. ఈ సందర్భంగా ఎస్వీ వేద విశ్వవిద్యాలయం ఆచార్యులు ఆచార్య ప్రవా రామకృష్ణ సోమయాజి మాట్లాడుతూ రామనామం సకలశుభకరమన్నారు. శ్రీరాముడు కుమారునిగా, మహారాజుగా, భర్తగా, సోదరునిగా, తండ్రిగా ఆదర్శప్రాయుడన్నారు. బాలకాండలోని శ్లోకాలను, విషూచికా మహమ్మారి నివారణ మంత్రమును ఎస్వీబీసీ ప్రత్యక్ష ప్రసారంలో కోట్లాది మంది ప్రజలు ఒకేసారి పారాయణం చేస్తే ఫలితం అనంతంగా ఉ ంటుందని వివరించారు.

# ముద్రగడ, కొత్తపల్లి భేటీపై చర్చ

కాకినాడ, జూన్ 10,అధికార వైసీపీ నుంచి ఇటీవలే సస్పెన్షన్ కు గురైన కొత్తపల్లి సుబ్బారాయుడితో కాపు ఉద్యమ నేత, మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం భేటీ కావడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. వీరి భేటీ రాజకీయ వర్గాలలో చర్చనీయాంశంగా మారింది. ముద్రగడ.. నర్సాపురంలోని కొత్తపల్లి నివాసానికి చేరుకుని.. దాదాపు రెండు గంటల పాటు చర్చించారు. అయితే వీరి భేటీలో ఏ ఏ అంశాలు చర్చకు వచ్చాయి అనే అంశాలపై ఎవరికి వారు విశ్లేషణలు చేస్తున్నారు. ఈ భేటీ అనంతరం ముద్రగడ మళ్లీ యాక్టివ్ అయ్యే అవకాశాలున్నాయన్న సంకేతాలు ఇస్తోందని పరిశీలకులు అంటున్నారు. జగన్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి.. ఇటీవల వరకు ముద్రగడ యమా సైలెన్స్ పాటిస్తూ వచ్చారు. ఇక జిల్లాల విభజనకు జగన్ ప్రభుత్వం శ్రీకారం చుట్టిన నేపథ్యంలో.. తూర్పు గోదావరి జిల్లాను విభజిస్తే.. ఓ జిల్లాకు బి.ఆర్ అంబేద్కర్, మరో జిల్లాలకు బాలయోగి పేర్లు పెట్టాలంటూ సీఎం వైయస్ జగన్‌కు నేరుగా ఆయన బహిరంగ లేఖ రాసిన సంగతి తెలిసిందే. అయితే అమలాపురం కేంద్రంగా కోనసీమ జిల్లా ఏర్పాటు చేసిందీ జగన్ ప్రభుత్వం.. ఆ తర్వాత బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాగా పేరు మార్చింది. ఆ క్రమంలో చోటు చేసుకున్న పరిణామాల వరకు కొత్త పల్లి, ముద్రగడల మధ్య చర్చకు వచ్చినట్లు సమాచారం.మరోవైపు పశ్చిమ గోదావరి జిల్లాల విభజన మొదలు.. బ్రిటీష్ కాలం నుంచి రెవిన్యూ డివిజన్ ఉన్న నరసాపురాన్ని జిల్లా కేంద్రం చేయకపోవడం...అలాగే రెవిన్యూ డివిజన్ లేని భీమవరాన్ని జిల్లా కేంద్రం చేయడం.. జిల్లా విభజన క్రమంలో ఎవరినీ సంప్రదించక పోవడం.. అలాగే నరసాపురం ఎంపీ రఘురామకృష్ణం రాజుని.. ఎమ్మెల్యేగా ఎం ప్రసాదరాజును గెలిపించడం కోసం తాను, తన సోదరుడు కొత్తపల్లి జానకీరామ్ పడిన కష్టం.. అన్నీ పూసగుచ్చినట్లు కొత్తపల్లి ముద్రగడకు వివరించినట్లు చెబుతున్నారు. అధికారంలోకి వచ్చిన జగన్ ఆ విషయాన్ని పూర్తిగా మరచిపోవడమే కాకుండా..

ఐయిదుసార్లు ఎమ్మెల్యే, ఓ సారి ఎంపీగా, మంత్రిగా, కార్పొరేషన్ చైర్మన్‌గా వివిధ పదవులలో సేవలందించి రాణించిన తన లాంటి సీనియర్‌ను జగన్ పక్కన పెట్టడం పట్ల కొత్తపల్లి సుబ్బారాయుడు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఎంపీ రఘు రామకృష్ణంరాజు జగన్ నువన్ని తిట్లు తిట్టినా.... ఆయనను వదిలేసి.. తనను సస్పెండ్ చేయడం ఏమిటో అర్థం కావడం లేదని ముద్రగడ ముందు కొత్త పల్లి సుబ్బారాయుడు ఆవేదన వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. నరసాపురాన్ని జిల్లా కేంద్రంగా కాకుండా.. భీమవరాన్ని జిల్లా కేంద్రం చేయడం పట్ల నరసాపురం ప్రాంత ప్రజలు.. జగన్ పైనా, వైసీపీపైనా తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని ముద్రగడకు కొత్తపల్లి వివరించినట్లు తెలుస్తోంది. అదీకాక.. రాష్ట్రంలో ఓ రాజకీయ పార్టీ అధికారంలోకి రావాలంటే గోదావరి జిల్లాలో కాపు సామాజిక వర్గ ఓట్లు అత్యంత కీలకమన్న సంగతి అందరికీ తెలిసిందే. ఈ నేపథ్యంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు చెందిన ముద్రగడ.. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన కొత్తపల్లితో భేటీ కావడం.. ఆ క్రమంలో సుదీర్ఘ మంతనాలు జరపడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకోవడమే కాకుండా అందరిలో ఉత్కంఠ, ఆసక్తి రేకెత్తించింది

# ఏపీలో విన్ విన్ ఫార్ములా

విజయవాడ, జూన్ 10, (న్యూస్ పల్స్)ఆంధ్రప్రదేశ్ రాజకీయాలలో పొత్తు పొడుపుల చర్చ ఎన్నికల వరకూ సాగుతూనే ఉండేలా కనిపిస్తోంది. రాష్ట్రంలో వైసీపీకి ప్రజాదరణ వేగంగా, గణనీయంగా తగ్గిపోతోందన్న అంచనాతో పార్టీలు వేటికవి తమ స్థానాన్ని బలోపేతం చేసుకోవిడానికి ఇదే అదును అని భావిస్తున్నాయి. ఈ క్రమంలోనే పొత్తు పొడుపుల చర్చ ఆగకుండా నడుస్తోంది. బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా రాష్ట్ర పర్యటనతో పొత్తు పొడుపులపై దాదాపు స్పష్టత వచ్చింది.జనసేనాని ఆప్షన్ ఇవ్వడం ద్వారా ఇటు తెలుగుదేశం పార్టీ, అటు బీజేపీ రెంటికీ పెద్దగా అక్కరకు రాని మిత్రుడిగా మిగిలిపోయారు. ఇక మిగిలింది తెలుగుదేశం, బీజేపీ.. ఈ రెండు పార్టీలూ కూడా ఏపీలో కలిసి పోటీ చేయడం ద్వారా ప్రయోజనం ఉంటుందని భావిస్తున్నాయి. అయితే బీజేపీకి ఏపీలో కనీసంలో కనీసం ఒక శాతం ఓట్లయినా ఉన్నాయా అన్నది అనుమానమే. అయితే కేంద్రంలో అధికారంలో ఉండటం, మరో మారు అధికారం చేజిక్కించుకోవాలన్న పట్టుదలతో ఉండటంతో ఆ పార్టీకి ఏపీలో అసెంబ్లీ స్థానాల కన్నా.. పార్లమెంటు నియోజకవర్గాలలో తమ అభ్యర్థులను గెలిపించుకోవడం ముఖ్యం. దీంతో పార్లమెంటు అభ్యర్థులను గెలిపించుకోవాలంటే అందుకు తెలుగుదేశంతో పొత్తు ఆ పార్టీకి అవసరం. జనసేనతో కలిసి వెళ్లినా.. ఆ పార్టీ అండతో పార్లమెంటు స్థానాలలో విజయం సాధించగలమన్న ధీమా బీజేపీలో కనిపించడం లేదు. దానికి తోడు ఆయన చీటికీ మాటికీ తన బలాన్ని హెచ్చుగా ఊహించుకుంటూ కండీషన్స్ అంటున్నారు. ఈ కారణంగానే నడ్డా తన రాష్ట్ర పర్యటనలో భాగంగా చేసిన ప్రసంగాలలో ఎక్కడా జనసేన ప్రస్తావన రాకుండా జాగ్రత్త పడ్డారు. అదే సమయంలో రాష్ట్రంలో అధికారంలో ఉన్న వైసీపీ పట్ల బీజేపీ వ్యతిరేక వైఖరిని విస్పష్టంగా తెలియజేశారు.అంతటితో ఊరుకుని ఉంటే తెలుగుదేశం, బీజేపీ పొత్తులపై ఇన్ని రాజకీయ స్పెక్యులేషన్స్ వచ్చి ఉండేవి కావు. ఇప్పటి దాకా రాష్ట్ర బీజేపీ నాయకులు జగన్ పై ఒకింత అభిమానం ఒలకబోస్తూ తమల పాకుతో తట్టినట్లుగా అధికార పార్టీపై విమర్శలు చేస్తూ, విపక్ష తెలుగుదేశంపై మాత్రం పదునైన ఘాటు విమర్శలతో విరుచుకుపడేవారు. నడ్డా అందుకు భిన్నంగా తెలుగుదేశంపై చిన్న పాటి విమర్శ కూడా లేకుండా, అదికార వైసీపీపైనే తన విమర్శల దాడి సాగించారు. ఇది ఒక రకంగా తెలుగుదేశం పార్టీకి చేరువ అవ్వడానికి బీజేపీ సిద్ధమన్న సంకేతం ఇవ్వడమే. ఆ సంకేతాన్ని తెలుగుదేశం సరిగ్గానే అందిపుచ్చుకుంది. బీజేపీతో పొత్తు కుదిరితే లాభ నష్టాలపై పార్టీలో అధినేత చంద్రబాబు నేతృత్వంలో చర్చలు జరుగుతున్నట్లు తెలుగుదేశం వర్గాలు చెబుతున్నాయి. ఈ చర్చల్లో పవన్ కల్యాణ్ పార్టీతో పొత్తు వల్ల లాభల కంటే నష్టాలే ఎక్కువ అన్న అభిప్రాయం బలంగా వ్యక్తమైందని చెబుతున్నారు. ఎందుకంటే జనసేనతో పొత్తు ఉంటే.. పొత్తులో భాగంగా కనీసంలో కనీసం పాతిక అసెంబ్లీ స్థానాలైనా ఆ పార్టీకి వదులు కోవాల్సి ఉంటుంది.అన్ని స్థానాలలో విజయం సాధించేంత బలం ఆ పార్టీకి ఉందో లేదో అనుమానమే. ఈ అనుమానానికి గత ఎన్నికలలో ఆ పార్టీ అన్ని స్థానాలలో పోటీ చేసి కేవలం ఒకే ఒక్క స్థానంలో విజయం సాధించడం, ఆ పార్టీ అధినేత స్వయంగా రెండు స్థానాలలో పోటీ చేసి రెండు చోట్లా పరాజయం పాలు కావడమే కారణమని పార్టీ వర్గాలు అంటున్నాయి. అదే బీజేపీతో పొత్తు పెట్టుకుంటే ఆ పార్టీకి అసెంబ్లీ స్థానాలపై పెద్దగా పట్టు ఉండదు. ఎందుకంటే రాష్ట్రంలో తమ స్టేక్ ఏమిటి, తమ బలం ఏమిటి, తమకు ఉన్న ఓటు శాతం ఎంత అన్న స్పష్టత ఉంది. అదీ కాక ఆ పార్టీకి రాష్ట్రంలో అధికారం చేపట్టడం కన్నా కేంద్రంలో అధికారం నిలుపుకోవడమే ముఖ్యం. అందు కోసం ఆ పార్టీ పొత్తులో భాగంగా అసెంబ్లీ స్థానాల కోసం పెద్దగా పట్టుబట్టదు. ఆ పార్టీకి పార్లమెంటు స్థానాలలో తమ అభ్యర్థుల విజయం అవసరం. ఇక తెలుగుదేశం పార్టీకి కేంద్రంలో చక్రం తిప్పాలన్న ఉద్దేశం ఇప్పటికైతే లేదు. రాష్ట్రంలో అధికారం చేజిక్కించుకోవడమే లక్ష్యం. అందుకే బీజేపీతో పొత్తు కుదరడమంటూ జరిగితే.. ఆ పార్టీకి రాష్ట్రంలోని పాతిక పార్లమెంటు స్థానాలలో సగం వరకూ ఆ పార్టీకి కేటాయించడానికి ఎటువంటి అభ్యంతరం ఉండదు. ఇది విన్ విన్ ఫార్ములాగా చంద్రబాబు భావిస్తున్నారు.ఇదే ప్రతిపాదనతో బీజేపీకి ఎర వేయాలని ఆయన పార్టీ నేతలతో చర్చ సందర్భంగా ప్రస్తావించినట్లు సమాచారం. బీజేపీకి కూడా ఈ ప్రతిపాదన ఆ పార్టీ అవసరాలకు తగినట్లు ఉంటుంది. రాష్ట్రంలో బలం లేకపోయినా తెలుగుదేశం అండతో పోటీ చేసే పార్లమెంటు స్థానాలలో అత్యధిక స్థానాలలో విజయం సాధించే అవకాశం ఉంటుంది. మొత్తం మీద జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఆప్షన్స్ వల్ల తెలుగుదేశం, బీజేపీ దగ్గరయ్యే పరిస్థితి వచ్చిందని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు.

# రద్దీ సమయంలో భక్తులు ఓపికతో ఉండాలి

**టిటిడి ఈవో ఎవి.ధర్మారెడ్డి**

తిరుమల జూన్ 10 తిరుమల అన్నమయ్య భవనంలో శుక్రవారం జరిగిన డయల్ యువర్ ఈవో కార్యక్రమంలో టిటిడి ఈవో ఎవి.ధర్మారెడ్డి భక్తులను ఉద్దేశించి ప్రసంగించారు. ఆ వివరాలు ఇలా ఉన్నాయి.తిరుమలలో వేసవి ఏర్పాట్లు వేసవి సెలవుల్లో తిరుమల శ్రీవారి దర్శనార్థం విశేషంగా విచ్చేస్తున్న భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా టిటిడిలోని అన్ని విభాగాలు సమన్వయంతో సేవలందిస్తున్నాయి. తిరుమలలో ఎక్కువ రద్దీ ఉన్న సమయంలో శ్రీవారి దర్శనం కోసం దాదాపు 2 రోజుల పాటు వేచి ఉ ండాల్సి వస్తుంది. అటువంటి సమయంలో భక్తులు ఓపికతో ఉండాలని విజ్ఞప్తి చేస్తున్నాను. జూలై 15వ తేదీ వరకు శుక్ర, శని, ఆదివారాల్లో విఐపి బ్రేక్ దర్శనాలను ప్రొటోకాల్ ప్రముఖులకు మాత్రమే పరిమితం చేశాం. తద్వారా ఎక్కువ మంది సామాన్య భక్తులు శ్రీవారిని దర్శించుకోగలుగుతున్నారు. ఇటీవల కాలంలో మే 29న అత్యధికంగా 92 వేల మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోవడం జరిగింది. టిటిడి సిబ్బందితోపాటు పోలీసులు, విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ సిబ్బంది, శ్రీవారి సేవకులు సమన్వయంతో పనిచేసి భక్తులకు చక్కటి సేవలు అందించారు. రానున్న రోజుల్లో ఇదే సమన్వయంతో పనిచేసి భక్తులకు మరింత మెరుగైన సేవలు అందిస్తామని తెలియజేస్తున్నాం.అమరావతిలో శ్రీవారి ఆలయ మహాసంప్రోక్షణ : సనాతన హైందవ ధర్మ ప్రచారంలో భాగంగా టిటిడి దేశవ్యాప్తంగా అన్ని ముఖ్య పట్టణాల్లో శ్రీవారి ఆలయాలు నిర్మిస్తోంది. ఇటీవల విశాఖపట్నం, భువనేశ్వర్లో నిర్మించిన శ్రీవారి ఆలయాలలో ఆగమోక్తంగా మహాసంప్రోక్షణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది.

అమరావతిలో టిటిడి నిర్మించిన శ్రీ వేంకటేశ్వరస్వామివారి ఆలయ మహాసంప్రోక్షణ కార్యక్రమాలు జూన్ 4 నుండి 9వ తేదీ వరకు జరిగాయి.ఆగస్టు 7న రాష్ట్రవ్యాప్తంగా కల్యాణమస్తు : పేదలకు తమ పిల్లల వివాహాలు ఆర్థికంగా భారం కాకూడదనే ఉద్దేశంతో ఉచితంగా సామూహిక వివాహాలు నిర్వహించాలని టిటిడి బోర్డు నిర్ణయించింది. రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాల్లో ఆగస్టు 7న కల్యాణమస్తు పేరుతో పెద్ద ఎత్తున ఉచిత సామూహిక వివాహాలు నిర్వహించనున్నాం. ఆయా జిల్లాల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, దశమి ఆదివారం ఉదయం 8 గం.07 నిమిషాల నుండి 8 గం. 17 నిమిషాల మధ్య టిటిడి పండితులు సుముహూర్తం నిర్ణయించారు.కరోనా కారణంగా నిలిచిన ఈ సామూహిక వివాహాలను పునఃప్రారంభించడం జరుగుతోంది. తద్వారా ఎన్నో కుటుంబాలు తమ పిల్లలకు స్వామివారి ఆశీస్సులతో వివాహాలు చేసుకునే చక్కటి అవకాశం కలుగుతుంది. టిటిడి అనుబంధ ఆలయాల్లో బ్రహ్మోత్సవాలు : హైదరాబాద్లోని హిమాయత్ నగర్లో గల శ్రీ వేంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాలు జూన్ 6 నుండి 10వ తేదీ వరకు జరిగాయి. అప్పలాయగుంట శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామివారి ఆలయ బ్రహ్మోత్సవాలు జూన్ 10 నుండి 18వ తేదీ వరకు జరుగనున్నాయి. శ్రీ పద్మావతి అమ్మవారి తెప్పోత్సవాలు : తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయంలో వార్షిక తెప్పోత్సవాలు ఈరోజు ప్రారంభమవుతాయి. జూన్ 14వ తేదీ వరకు జరుగుతాయని అయన వెల్లడించారు.

# లోకేష్ జూమ్ మీటింగ్ లో చొరబాటుపై సీఐడీకి కంప్లైంట్

విజయవాడ, జూన్ 10, (న్యూస్ పల్స్)ఏపీలో ట్వీట్ల వార్ తో పాటు కొత్త వివాదాలు తెరమీదకు వచ్చాయి. ట్వీట్లతో వైసీపీ-టీడీపీ నేతలు రెచ్చిపోతుంటే.. తాజాగా జూమ్ మీటింగ్ లలో అధికార పార్టీ నేతలు చొచ్చుకురావడంపై వివాదం రేగింది. దీనిపై రాజకీయ రగడ కొనసాగుతోంది. టీడీపీ జూమ్ కాన్ఫరెన్సులో వైసీపీ నేతలు జొరబడ్డ ఎపిసోడుపై సీఐడీకి టీడీపీ ఫిర్యాదు చేసింది. లోకేష్ నిర్వహించిన జూమ్ మీటింగులోకి మాజీ మంత్రి కొడాలి నాని, వైసీపీ ఎమ్మెల్యే వంశీ సహా వైసీపీ నేతలు జొరబడడంపై సీఐడీ చీఫ్ సునీల్ కుమారుకు లేఖ రాశారు టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య.ఫిర్యాదులో వర్ల రామయ్య అనేక అంశాలు ప్రస్తావించారు. రెండు రాజకీయ సమూహాల మధ్య గొడవలు పెట్టేందుకు వైసీపీ నాయకులు ప్రయత్నించారు.కొడాలి నాని, వంశీ, కొత్తపల్లి రజనీ, దేవేందర్ రెడ్డిలు వేరే వారి పేర్లతో లోకేష్ జూమ్ కాన్ఫరెన్సులోకి వచ్చారు. వల్లభనేని వంశీ, కొడాలి నానీలు లోకేష్ తో గతంలోనే పూర్తిగా వైరుధ్యం కలిగి ఉన్నారు. నాని, వంశీ చర్యలు నేరపూరిత కుట్రగా కనిపిస్తున్నది. గొడవలు పెట్టాలని ప్రయత్నించిన నాని, వంశీలపై నేరపూరిత కుట్ర సెక్షన్ల కింద కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.వీలైనంత త్వరగా విచారించి దోషులకు శిక్షపడేలా చర్యలు తీసుకోవాలి.పదో తరగతిలో ఫెయిలైన విద్యార్థులతో లోకేష్ నిర్వహించిన జూమ్ మీటింగ్‌లోకి చొరబడ్డారు.కొంతమంది వైసీపీ నేతలు ఆహ్వానం లేకుండానే తప్పుడు పేర్లతో లాగిన్ అయ్యి మీటింగ్‌లోకి చొరబడ్డారు.అనుచిత పదజాలంతో తీవ్రమైన వ్యాఖ్యలు చేశారు.రాజకీయంగా గతంలో సైతం వీరు అనేక అనుచిత వ్యాఖ్యలు చేశారు.నేరపూరిత కుట్రతో జూమ్ మీటింగులోకి అక్రమంగా చొరబడ్డారని తన ఫిర్యాదులో పేర్కొన్నారు వర్ల రామయ్య.

## వంద రూపాయల నాణెంపై ఎన్టీఆర్ బొమ్మ

-పురందేశ్వరి



తిరుపతి ఎన్టీఆర్ బొమ్మను వంద రూపాయల నాణెంపై ముద్రించేందుకు ఆర్బిఐ గవర్నర్ సుముఖత వ్యక్తం చేసినట్లు మాజీ కేంద్ర మంత్రి పురందేశ్వరి తెలిపారు. తిరుపతిలో మీడియాతో మాట్లాడుతూ త్వరలోనే ఎన్టీఆర్ బొమ్మ ఉన్న వంద రూపాయల నాణెం ప్రజల్లోకి వచ్చే అవకాశం ఉందన్నారు. ఎన్టీఆర్ కు భారతరత్న ఇవ్వాలన్నారు. తిరుపతి అంటే ఎన్టీఆర్ కు ఎంత ఇష్టమని.. రాజకీయ జీవితాన్ని తిరుపతి నుంచే ఆయన ప్రారంభించారని పురందేశ్వరి చెప్పారు. ఎన్టీఆర్ శతజయంతి వేడుకలు మరో పది నెలల పాటు వివిధ ప్రాంతాల్లో నిర్వహిస్తామని.. ఎన్టీఆర్ ను అభిమానించే ప్రతి ఒక్కరు శత జయంతి వేడుకలకు రావాలని కోరారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి తిరుపతిలో జరిగిన శత జయంతి వేడుకల్లో పాల్గొనడం ఎంతో సంతోషంగా ఉందన్నారు.

## జనం నాడి తెలిసిన నేత ఎన్టీఆర్

తిరుపతి రిటైర్ అయిన తరువాత ఎన్టీఆర్ పై పుస్తకం రాస్తానన్నారు సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎన్వీ రమణ. తిరుపతి శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీలోని శ్రీనివాస ఆడిటోరియంలో జరిగిన ఎన్టీఆర్ శతజయంతి వేడుకల్లో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జస్టిస్ ఎన్వి రమణ మాట్లాడుతూ ఎన్టీఆర్ కు తిరుపతితో ఎంతో అనుబంధం ఉందన్నారు. ఎన్టీఆర్ గురించి ఎంత మాట్లాడినా తక్కువ అని..ఆయన ఓ సమగ్ర సమతా మూర్తి అని కొనియాడారు. రైతుబిడ్డగా, రంగస్థల నటుడిగా, కథానాయకుడిగా, రాజకీయ నాయకుడిగా ఆయన ఎదిగారు..ఆయన జనం నాడి తెలిసిన వ్యక్తి అన్నారు.

## జిల్లా గ్రంథాలయ డైరెక్టర్ల ఆధ్వర్యంలో గ్రూప్-1 పుస్తకాల పంపిణీ

కమాన్ పూర్ గ్రంథాలయం అందుబాటులో లేని రామగిరి మండలంలోని నిరుద్యోగ యువతీ యువకుల కోసం తెప్పించిన గ్రూప్ పుస్తకాలను ఇప్పటికే చాలా మంది యువతి యువకులకు పంపిణీ చేశారు దీనిలో భాగంగా ఈరోజు పన్నూర్ లోని జిల్లా గ్రంథాలయ డైరెక్టర్ ఇజ్జగిరి రాజు లడ్డూ స్వగృహం నందు రత్నాపూర్ గ్రామానికి చెందిన కండ శ్రీకాంత్ కు గ్రూప్ 1 పుస్తకాలని ×పెద్దపల్లి జిల్లా గ్రంథాలయం డైరెక్టర్లు ఇజ్జగిరి రాజు లడ్డు ,గుడిసె గట్టయ్య అందించారు ఈ కార్యక్రమంలో పెద్దపెల్లి జిల్లా తెరాస యువ నాయకులు సిరిసిల్ల వనిల్ కుమార్ ,పన్నూర్ యూత్ జనరల్ సెక్రటరీ ఇజ్జగిరి సాయి వరుణ్, సామాజిక సేవకులు ఇజ్జగిరి సాకేత్ మరియు ఇజ్జగిరి మహేష్ లు పాల్గొన్నారు.

## ఎర్ర చందనం అక్రమరవాణా

**ఆరుగురు ముద్దాయిలు అరెస్టు**

కడప చెన్నూరు పోలీసు స్టేషన్ పరిధిలో కేసు నెంబరు. 144/2019 నందలి ఎర్రచందనము అక్రమ రవాణా కేసులో ఆరుగురు ముద్దాయిల ను అరెస్టు చేసినట్లు జిల్లా ఎస్.పి కె.కె.ఎన్ అన్బురాజన్ వెల్లడిచెన్నూరు పోలీసు స్టేషన్ నేర సంఖ్య 149/2019 కేసులో అరెస్టు కాకుండా పోలీసు వారికి దొరకకుండా తప్పించుకు తిరుగుతున్న ఆరు మంది స్మగ్లర్ లను అరెస్టు చేసినట్టు జిల్లా ఎస్పీ కె.కె.ఎన్ అన్బురాజన్ ఒక పత్రికా ప్రకటన లో తెలిపారు. ముద్దాయిల గురించి రాబడిన సమాచారాముపై కడప డి.ఎస్.పి బి. వెంకటశివారెడ్డి పర్యవేక్షణ లో అర్బన్ ఇన్స్పెక్టర్ ఎస్.హాసం, చెన్నూరు ఎస్ ఐ, బి. శ్రీనివాసుల రెడ్డి సిబ్బందితో కలసి 9 వ తేదీన ఉదయం చెన్నూరు మండలము కడప-చెన్నై జాతీయ రోడ్డులో ఇర్కాన్ సర్కిల్ వద్ద పై తెలిపిన ఆరు మంది వ్యక్తులు వాహనము కొరకు ఎదురు చూస్తూ ఉండి పోలీసు వారిని చూసి పారిపోవుటకు ప్రయత్నించగా అనుమానంతోటి సదరు ఆరుగురు వ్యక్తులను అదుపులోనికి తీసుకొన్నట్లు తెలిపారు. పంచాయతీదార్ల సమక్షంలో విచారించగా వారందరూ 2019 వ సంవత్సరము ఆగష్టు నెలలో 45 ఎర్రచందనము దుంగలను కొట్టి వాటన్నింటిని చెన్నూరు మండలము గనిలో బావి వద్దనున్న రిజర్వు పారెస్టులో దాచిపెట్టి తరువాత ఏడుగురు ఇతర ముద్దాయిలకు అమ్మి, రవాణా చేయుసమయములో18.08.2019 వ తేదీన పోలీసులకు పట్టుబడిన కేసులో ముద్దాయిలుగా ఉన్నారన్నారు.



# సాగులో లేని భూములను సాగులోకి తీసుకొచ్చేలా కార్యాచరణ ప్రణాళికను రూపొందించి అమలు చేయాలి



**విత్తనాలు అమ్మే ప్రతి దుకాణాన్ని తనిఖీ చేయాలి**
**నకిలీ విత్తనాలు విక్రయిస్తే క్రిమినల్ కేసులు నమోదు-కర్నూలు జిల్లా కలెక్టర్ పి కోటేశ్వరరావు**

కర్నూలు , జూన్ 10 -: సాగులో లేని భూములను సాగులోకి తీసుకొచ్చేలా కార్యాచరణ ప్రణాళికను రూపొందించి అమలు చేయాలని కర్నూలు జిల్లా కలెక్టర్ పి కోటేశ్వరరావు వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు..శుక్రవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ లో వ్యవసాయ,ఉద్యాన,పట్టుపరిశ్రమ,పశు సంవర్ధక, మైక్రో ఇరిగేషన్,ఫిషరీస్ శాఖల అధికారులతో ఆయా శాఖల కార్యక్రమాల అమలుపై కలెక్టర్ సమీక్షించారు .ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాలు వచ్చాయి.. సిబ్బంది పెరిగారు.. రెగ్యులర్ గా చేసే కార్యక్రమాలతో పాటు అదనంగా వ్యవసాయాభివృద్ధి కార్యక్రమాలను చేపట్టాలన్నారు.. ప్రస్తుతం జిల్లాలో 4.11 లక్షల హెక్టార్లు సాధారణ సాగు విస్తీర్ణం కాగా ఈ విస్తీర్ణాన్ని మరింత పెంచాలని కలెక్టర్ ఆదేశించారు. తక్కువ భూమిలో ఎక్కువ ఆదాయాన్ని ఇచ్చే పంటలు సాగు చేసే విధంగా రైతులకు సలహాలు ఇవ్వాలన్నారు.. వరికి ప్రత్యామ్నాయంగా, తక్కువ నీటితో ఎక్కువ ఆదాయాన్ని పెంచే ఇతర పంటలను సాగు చేసేలా రైతులను ప్రోత్సహించాలన్నారు.. గత ఏడాది ఖరీఫ్ లో ఇదే సమయానికి 2106 హెక్టార్ల లో పంటలను సాగు చేయగా, ఈ ఏడాది ఇప్పటికే 9964 హెక్టార్ల లో పంటలు సాగు చేశారన్నారు.. ఉల్లి, టమోటా వంటి పంటలకు మార్కెటింగ్ సమస్యలు రాకుండా ముందుగానే చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు..విత్తనాలు అమ్మే ప్రతి దుకాణాన్ని తనిఖీ చేయాలిజిల్లాలో నాణ్యత లేని విత్తనాల వల్ల రైతులు నష్టపోకూడదని, విత్తనాలమ్మే ప్రతి దుకాణాన్ని తనిఖీ చేయాలని కలెక్టర్ ఆదేశించారు..నాన్ సబ్సిడీ విత్తనాలు కూడా నాణ్యత గా ఉండేలా చూడాలన్నారు.. నాణ్యతలేని విత్తనాలను విక్రయించే వారిపై కఠినంగా వ్యవహరించాలని, క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కలెక్టర్ ఆదేశించారు.. ఇప్పటివరకు అధికారులు విత్తన దుకాణాలను తనిఖీ చేసిన నివేదికలను తనకందజేయాలని తెలిపారు..రైతు భరోసా కేంద్రాల్లో విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు .. పొలంబడి ద్వారా రైతులకు అవగాహన కల్పించే కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఆ కార్యక్రమాల వీడియో లను తీసి వాటిని వ్యవసాయ సలహా మండలి సమావేశాల్లో ప్రదర్శించాలని కలెక్టర్ సూచించారు. కర్నూలు జిల్లాలో ఉద్యాన పంటల సాగు విస్తీర్ణం పెరిగేలా రైతులను మరింత ప్రోత్సహించాలని కలెక్టర్ ఆదేశించారు.. జిల్లాలో అధికంగా పండిస్తున్న ఉల్లి సాగులో సాంకేతికత ను ఉపయోగించుకునేలా రైతులకు ఆర్బీకే ల ద్వారా అవగాహన కల్పించాలని సూచించారు.. ఉల్లి గోడౌన్ ల ఏర్పాటుకు 50 శాతం సబ్సిడీ ఉన్నందున రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.. నేషనల్ బ్యాంబూ మిషన్ కింద బ్లాక్ ప్లాంటేషన్ లేదా బౌండరీ ప్లాంటేషన్ కింద వెదురు (ఃజీఏఎనీసీ) సాగు కు వెనుకబడిన ఆదోని ప్రాంతంలో రైతులు ముందుకు వచ్చేలా ప్రోత్సహించాలని సూచించారు..జిల్లాలో ఈ ఏడాది 6500 హెక్టార్లలో బిందు,తుంపర సేద్యం అమలు లక్ష్యం కాగా, జిల్లాలోని అన్ని మండలాల్లో ఈ కార్యక్రమం జరగాలని కలెక్టర్ ఆదేశించారు..ఇందుకు సంబంధించి రైతులను గుర్తించడం జరిగిందని, రిజిస్ట్రేషన్ ప్రక్రియ కొనసాగుతుందని ంఖఓఎఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఉమాదేవి కలెక్టర్ కు వివరించారు.జిల్లా లో మల్బరీ సాగు ద్వారా మంచి ఆదాయం వచ్చే అవకాశం ఉందని, రైతులు మల్బరీ సాగు చేసేలా అధికారులు దృష్టి పెట్టాలని సూచించారు.. ప్రస్తుతం పత్తికొండ తుగ్గలి వెల్దుర్తి కృష్ణగిరి కోడుమూరు కర్నూలు ఓర్వకల్లు కౌతాళం పెద్దకడబూరు మండలాల్లో సెరికల్చర్ ఉందని అధికారులు వివరించారు..జిల్లాలో పాడి పరిశ్రమ అభివృద్ధితో పాటు గ్రామాల్లో సక్రమంగా పశు వైద్య సేవలను అందించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు.. ఆదోని, మంత్రాలయం తుంగభద్ర నదీ పరివాహక ప్రాంతాల్లో ఆక్వా కల్చర్ ను పెంచాలని సూచించారు. వ్యవసాయం లేని రైతులను చేపల పెంపకం వైపు ప్రోత్సహించాలని,పెంపకం లో మెరుగైన పద్ధతులను పాటించేలా అవగాహన కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు.

# పేదలందరికీ ఇళ్లు మంజూరు చేయాలన్నది ప్రభుత్వ లక్ష్యం



**వర్షాలు వచ్చే లోపు ఇంటి నిర్మాణాలు జరగాలి**
**-: కర్నూలు జిల్లా కలెక్టర్ పి కోటేశ్వరరావు**

కర్నూలు , జూన్, 10 -: పేదలందరికీ ఇళ్లు నిర్మించాలన్నది ప్రభుత్వ లక్ష్యం అని కర్నూలు జిల్లా కలెక్టర్ పి కోటేశ్వరరావు పేర్కొన్నారు.శుక్రవారం గూడూరు మండలం కేంద్రం సమీపంలో మరియు పులకుర్తి దారిలో ఉన్న జగనన్న కాలనీ లేఅవుట్ లలో చేపడుతున్న ఇళ్ళ నిర్మాణాల పురోగతిని జిల్లా కలెక్టర్ పరిశీలించారు.ఈ సందర్భంగా కర్నూలు జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నవరత్నాలు పేదలందరికీ ఇళ్ల కార్యక్రమంలో భాగంగా ఇళ్ల నిర్మాణం కోసం గుంతలు తీసిన వెంటనే రో.15 వేలు మంజూరు చేస్తున్నామని, ఇంటి నిర్మాణానికి అవసరమైన సిమెంట్, ఇసుక అందిస్తున్నామని, లబ్దిదారులు త్వరితగతిన ఇళ్లు నిర్మించుకోవాలని కలెక్టర్ సూచించారు . ఇసుక అవసరమున్న ప్రతి ఒక్క లబ్దిదారు కు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఇసుక అందేలా చర్యలు తీసుకోవాలని గృహ నిర్మాణ శాఖ డిఈని కలెక్టర్ ఆదేశించారు.వర్షాలు వచ్చేలోపు ఇళ్ల నిర్మాణం జరిగేలా ప్రణాళికా బద్ధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. లే అవుట్ లో విద్యుత్, నీటి సౌకర్యాలపై కలెక్టర్ ఆరా తీశారు. ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి కూడా స్వయం సహాయక సంఘాల్లో ఉన్న మహిళలకు ఎవరికైనా ఆర్థిక సహకారం కావాలంటే రుణ సదుపాయం అందిస్తామన్నారు. బిలో బేస్మెంట్ స్థాయిలో ఉన్న ఇళ్లను బేస్మెంట్ స్థాయికి తేవాలన్నారు. తమకు ఇల్లు మంజూరు చేయాలని రామాంజనేయులు అనే వ్యక్తి కోరగా ఇళ్లు మంజూరు కాని లబ్ధిదారులకు కూడా రెండవ దశలో ఇళ్లు మంజూరు చేస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ తో పాటు గృహ నిర్మాణ శాఖ డిఈ, ఎంపిడిఓలు, తదితరులు పాల్గొన్నారు.

## గోస్పాడు మండలం పసురుపాడు గ్రామ సమస్యలు పరిష్కరించాలి..-: సిపిఐ డిమాండ్

నంద్యాల జూన్ 10 -: గోస్పాడు మండలం పసురుపాడు గ్రామంలో వున్న సమస్యలన్నింటిని వెంటనే పరిష్కరించాలని సిపిఐ పార్టీ నంద్యాల జిల్లా సహాయ కార్యదర్శి ఎస్ బాబాఫకృద్దీన్ డిమాండ్ చేశారు శుక్రవారం స్థానిక గోస్పాడు మండలం పసురుపాడు గ్రామంలో సిపిఐ పార్టీ గ్రామ శాఖ మహాసభ జిలాని బాష అధ్యక్షతన నిర్వహించుకోవడం జరిగిందని ఈ గ్రామ శాఖ మహాసభకు ముఖ్య అతిథులుగా సిపిఐ పార్టీ నంద్యాల జిల్లా సహాయ కార్యదర్శి ఎస్ బాబా ఫక్రుద్దీన్ హాజరు కావడం జరిగింది ఈ సమావేశంలో సిపిఐ పార్టీ గోస్పాడు మండల కార్యదర్శి ఇ చెన్నయ్య వ్యవసాయ కార్మిక సంఘం డివిజన్ కార్యదర్శి సుబ్బారాయుడు రైతు సంఘం డివిజన్ కార్యదర్శి సోమన్న ఏఐటీయూసీ గోస్పాడు మండల కార్యదర్శి సుబ్బయ్య వ్యవసాయ కార్మిక సంఘం గోస్పాడు మండల కార్యదర్శి హరినాథ్ ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు సురేష్ లు పాల్గొన్నారు అనంతరం పై నాయకులు మాట్లాడుతూ గ్రామంలో అనేక సమస్యలతో పేద ప్రజలు కొట్టుమిట్టాడుతున్నారని వైయస్సార్ గృహాలు లబ్ధిదారులకు సక్రమంగా ఇవ్వడం లేదని ముఖ్యంగా గ్రామంలో కొన్ని ఏళ్ల తరబడి నివసిస్తున్న పిచ్చుకే కులానికి చెందిన దాదాపు 30 కుటుంబాలకు నేటికీ వారికి క్యాస్ట్ సర్టిఫికెట్ లేదని అధికారులను అడిగితే మీ వాళ్ళు ఎక్కడైనా ఉంటే వారికి క్యాస్ట్ సర్టిఫికెట్ ఎవరైనా ఇచ్చి ఉంటే తెచ్చుకోవాలని దాన్ని బట్టి మీకు క్యాస్ట్ సర్టిఫికెట్ ఇస్తామని ఉచిత సలహాలు ఇవ్వడం జరుగుతుందని కాబట్టి ప్రభుత్వ అధికారులు వెంటనే స్పందించి పిచ్చికే కులానికి చెందిన వారికి అందరికీ క్యాస్ట్ సర్టిఫికెట్ మంజూరు చేయాలని అలాగే వారిలో ఇల్లు లేని నిరుపేదలు చాలామంది ఉన్నారు

# డైరెక్టర్ను ఉక్కిరి బిక్కిరి చేస్తున్న సీనియర్ హీరో?




సాధారణంగా తమ సినిమాలు హిట్ అయితే హీరోలు డైరెక్టర్లకు బహుమతి ఇవ్వడం సాధారణం. శ్రీమంతుడు హిట్ అయినప్పుడు కొరటాల శివకు మహేశ్ బాబు భీష్మ సూపర్ టాక్ సాధించినప్పుడు వెంకీ కుడుములకు నితిన్ కారును గిఫ్ట్ ఇచ్చారు. ఇలా చాలా మంది హీరోయి దర్శకులకు మ్యూజిక్ డైరెక్టర్లకు సినిమా బృందాలకు గిఫ్ట్ ఇవ్వడం కామన్. విక్రమ్ సినిమాతో దాదాపు నాలుగేళ్ల గ్యాప్ తర్వాత బ్లాక్బస్టర్ అందుకున్న విలక్షణ నటుడు కమల్ హాసన్ కూడా ఆ సినీ దర్శకుడు లోకేశ్ కనకరాజ్కు ఖరీదైన లగ్జరీ కారును బహుమతిగా ఇచ్చారు.స్వాతిముత్యం సాగరసంగమం వంటి క్లాసిక్ చిత్రాలు.. ఇండియన్ వంటి పేట్రియాటిక్ సినిమాలు.. దశావతారం వంటి ప్రయోగాత్మక చిత్రాల్లో నటించి తనకంటూ ఓ మార్కు సృష్టించుకుని సినీ చరిత్రలో తనకంటూ ఓ పేజీని రాసుకున్న విలక్షణ నటుడు కమల్ హాసన్కు దాదాపు నాలుగేళ్లుగా హిట్ సినిమాలు లేవు. ప్రయోగాత్మకంగా ఉన్నా ఇటీవల చాలా వరకు ఆయన సినిమాలు బాక్సాఫీస్ వద్ద బోల్తా కొడుతున్నాయి. ప్రేక్షకులను కూడా అంతగా అలరించడంలేదు. కానీ దాదాపు నాలుగేళ్ల తర్వాత ఫామ్లోకి వచ్చిన కమల్ విక్రమ్ సినిమాతో ఇటు బాక్సాఫీస్ను బద్దలు కొట్టడమే గాక అటు ప్రేక్షకుల మనసునూ కొల్లగొట్టారు.విక్రమ్ సినిమాతో విలక్షణ నటుడు కమల్ హాసన్ దాదాపు నాలుగేళ్ల తర్వాత సక్సెస్ అందుకున్నారు. కమల్తోపాటు ఈ సినీ బృందమంతా విజయోత్సాహంలో మునిగితేలుతున్నారు. మూవీ సక్సెస్ మీట్లతో బిజీబిజీగా గడుపుతున్నారు. ఈ క్రమంలో కమల్ విక్రమ్ మూవీ డైరెక్టర్ లోకేశ్ కనకరాజ్ను సర్ప్రైజ్ చేశారు. ఖరీదైన లగ్జరీ కారును బహుమతిగా అందజేసి లోకేశ్ను ఆశ్చర్యంలో ముంచారు. దాదాపు కోటి రూపాయలకు పైగా విలువ చేసే లెక్సాస్ లగ్జరీ కారును లోకేశ్కు ఇచ్చారు కమల్.కేవలం విక్రమ్ సినిమా డైరెక్టర్కే కాదు అసిస్టెంట్ డైరెక్టర్లను కూడా కమల్ హాసన్ సర్ప్రైజ్ చేశారు. ఈ సినిమాకు పని చేసిన 13 మంది అసిస్టెంట్ డైరెక్టర్లకు అపాచీ ఆర్టీఆర్ 160 బైక్లను గిఫ్ట్గా ఇచ్చారు. ఒక్కో బైక్ ధర సుమారు రూ.1.45 లక్షలు ఉంటుంది. విక్రమ్ సినిమా కోసం వీరంతా చాలా కష్టపడ్డారని.. వారి కష్టానికి ఫలితంగా తనకు వాళ్ల కోసం ఏదైనా చేయాలనిపించిందని కమల్ అన్నారు. అందుకే వారిని సర్ప్రైజ్ చేయడానికి బైక్లు గిఫ్ట్గా ఇచ్చానని చెప్పారు.కమల్ సర్ప్రైజ్ గిఫ్ట్లకు సంబంధించిన ఫొటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. కమల్ సర్ప్రైజ్ అదిరిందంటూ నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు. తన సినిమా బృందం పట్ల కమల్ హాసన్ చూపిన ప్రేమకు తాము ఫిదా అంటూ మరికొందరు పోస్ట్ చేస్తున్నారు. లోకేశ్ కనకరాజ్ దర్శకత్వంలో తెరకెక్కిన విక్రమ్ సినిమా జూన్ 3న ప్రపంచ వ్యాప్తంగా విడుదలైంది. సూర్య ఫహాద్ ఫాజిల్ విజయ్ సేతుపతి వంటి విలక్షణ నటులు సూపర్ స్టార్లు నటించిన ఈ సినిమా బ్లాక్ బస్టర్ టాక్ను సొంతం చేసుకుంది.నాలుగేళ్లుగా హిట్ కోసం ఎదురుచూస్తున్న కమల్ హాసన్కు విక్రమ్ ఫలితం జోష్నిచ్చింది. ఈ సినివా విడుదలైన నాలుగు రోజుల్లో దాదాపు రూ.200 కోట్లు వసూల్ చేసింది. ఇక వీకెండ్స్లో అత్యధిక కలెక్షన్లు సాధించిన చిత్రాల్లో విక్రమ్ మూడో స్థానంలో నిలిచింది. ఈ మూవీని తెలుగులో విక్రమ్ హిట్ లిస్ట్ పేరుతో ప్రముఖ సినీ నిర్మాత సుధాకర్ రెడ్డి హీరో నితిన్ విడుదల చేశారు. 67 ఏళ్ల వయసులోనూ యంగ్ హీరోలకు ఏ మాత్రం తీసిపోకుండా యాక్షన్ సీన్స్లో నటించారు కమల్ హాసన్.

# మారుతి మార్క్ 'పక్కా కమర్షియల్' ట్రైలర్ గ్లింప్స్..!




టాలీవుడ్ మాచో స్టార్ గోపీచంద్ హీరోగా దర్శకుడు మారుతి తెరకెక్కిస్తున్న తాజా చిత్రం "పక్కా కమర్షియల్". స్టార్ ప్రొడ్యూసర్ అల్లు అరవింద్ సమర్పిస్తున్న ఈ కోర్టు డ్రామాలో గార్జియస్ బ్యూటీ రాశీఖన్నా హీరోయిన్ గా నటిస్తోంది. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ సినిమా విడుదలకు సిద్ధమవుతోంది. ఈ నేపథ్యంలో మేకర్స్ ప్రమోషన్స్ ముమ్మరం చేశారు.ఇప్పటికే 'పక్కా కమర్షియల్' సినిమా నుంచి వచ్చిన ప్రమోషనల్ కంటెంట్ కు ఆడియన్స్ నుంచి మంచి రెస్పాన్స్ వచ్చింది. ఫస్ట్ లుక్ - గ్లిమ్స్ - టీజర్ - దివంగత గేయ రచయిత సిరివెన్నెల సీతారామశాస్త్రి రాసిన టైటిల్ సాంగ్ - 'అందాల రాశీ' పాట అన్ని వర్గాల వారిని విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ క్రమంలో ట్రైలర్ ను రిలీజ్ చేయడానికి చిత్ర యూనిట్ రెడీ అయింది.ఇందులో భాగంగా తాజాగా 'పక్కా కమర్షియల్' ట్రైలర్ గ్లింప్స్ ను సోషల్ మీడియాలో వదిలారు. మారుతి మార్క్ ప్రమోషనల్ స్ట్రాటజీతో కట్ చేయబడిన ఈ వీడియో అలరిస్తోంది. 'మీరు కేసు ఒప్పుకునే ముందు ఫీజు వద్దు రమ్మంటారు.. పనయ్యాక వాణ్ణి వంగబెట్టి..' అని కమెడియన్ శ్రీనివాసరెడ్డి చెప్తుండగా.. వీడియో బఫర్ అవుతున్నట్లు చూపించారు.అయితే అది బఫర్ అవడం లేదు.. కావాలనే ఆపేసాం అని చెప్పి నవ్వించారు మారుతి. ముహూర్తం టైం చూసి జూన్ 12న ఫుల్ ట్రైలర్ ను లాంచ్ చేయబోతున్నట్లు ప్రకటించారు. ఇందులో 'పక్కా కమర్షియలేయ్' అంటూ అల్లు అరవింద్ మాటలను కూడా జత చేయడం విశేషం.ఈ సినిమాలో పక్కా కమర్షియల్ లాయర్ గా గోపీచంద్ కనిపించనున్నారని తెలుస్తోంది. యాక్షన్ హీరో మునుపటి చిత్రాల కంటే చాలా స్టైలిష్ గా కనిపించారు. సత్యరాజ్ - ప్రవీణ్ - జబర్దస్త్ వేణు - చమ్మక్ చంద్ర - రఘు తదితరులు ఈ సినిమాలో నటించారు. ఈ గ్లింప్స్ రాబోయే ట్రైలర్ పై అంచనాలు పెంచేసిందని చెప్పాలి.జీఏ2 పిక్చర్స్ ఓ యూవీ క్రియేషన్స్ పతాకాలపై బన్నీ వాసు ఈ చిత్రాన్ని నిర్మించారు. ూఐఔ సహ నిర్మాతగా వ్యవహరించారు. జేక్స్ బిజోయ్ సంగీతం సమకూర్చారు. కరమ్ చావ్లా సినిమాటోగ్రఫీ అందించగా.. ఎస్బీ ఉద్ధవ్ ఎడిటింగ్ చేశారు. ఆర్ రవీందర్ ఆర్ట్ డైరెక్టర్ గా వర్క్ చేశారు. 'పక్కా కమర్షియల్' చిత్రాన్ని 2022 జూలై 1న ప్రపంచ వ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నారు.

# కొత్త దర్శకుడికి మాస్ రాజా షాక్?

మాస్ మహారాజా గత ఏడాది వరకు వరుస ఫ్లాపులతో సతమతమయ్యారు. ఇక రవితేజ కెరీర్ అయిపోయినట్టేనా అనే వార్తలు జోరుగా వినిపించాయి. అయితే అదే సమయంలో రవితేజ బ్లాక్ బస్టర్ హిట్ తో టెర్రిఫిక్ కమ్ బ్యాక్ అయ్యారు. గోపీచంద్ మలినేని డైరెక్షన్ లో రూపొందిన ఈ మూవీ 'క్రాక్'. గత ఏడాది సంక్రాంతి బరిలో యాభై శాతం థియేటర్ ఆక్యుపెన్సీ విధానంలో విడుదలైన ఈ మూవీ రికార్డు స్థాయి వసూళ్లని రాబట్టింది.హీరో రవితేజకు




మాసీవ్ బ్లాక్ బస్టర్ ని అందించి గత కొంత కాలంగా వరుస ఫ్లాపులతో ట్రాక్ తప్పిన రవితేజని ఈ మూవీ మళ్లీ ట్రాక్ లోకి తీసుకొచ్చింది. 'క్రాక్' అందించిన బ్లాక్ బస్టర్ విజయంతో రెట్టించిన ఉత్సాహంతో వున్న రవితేజ బ్యాక్ టు బ్యాక్ సినిమాలని అంగీకరించడం మొదలు పెట్టారు. కొత్త దర్శకుడు శరత్ మండవతో 'రామారావు ఆన్ డ్యూటీ' సుధీర్ వర్మతో 'రావణాసుర' త్రినాథరావు నక్కిన డైరెక్షన్ లో 'ధమాకా' కొత్త దర్శకుడు వంశీ డైరెక్షన్ లో 'టైగర్ నాగేశ్వరరావు' వంటి చిత్రాల్లో నటిస్తున్నాడు.ఇవే కాకుండా మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న 'వాల్తేరు వీరయ్య' మూవీలోనూ ఓ కీలక పాత్రలో కనిపించబోతున్నారు. ఈ ఐదు చిత్రాల్లో ఇప్పటికే శరత్ మండవ దర్శకుడిగా పరిచయం అవుతున్న 'రామారావు ఆన్ డ్యూటీ' చిత్రీకరణ పూర్తయింది. అయితే రిలీజ్ రెడీ అయిన ఈ మూవీ వరుసగా వాయిదా పడుతూ వస్తోంది. దీనికి అసలు కారణం హీరో రవితేజ అని తెలిసింది. ముందు ఈ మూవీని గత ఏడాది డిసెంబర్ 6న విడుదల చేయాలని ప్లాన్ చేశారు. అది కాస్త ఈ ఏడాది మార్చి 25కు మారింది.అయితే ఇదే సమయంలో 'ట్రిపుల్ ఆర్'సడన్ గా లైన్ లోకి రావడంతో మరో సారి ఈ మూవీని జూలై 17కు మార్చారు. ఫైనల్ గా ప్రోస్ట్ ప్రొడక్షన్ వర్క్ కారణంగా ఈ మూవీ రిలీజ్ ని మరో సారి వాయిదా వేశారు. అయితే కొన్ని సీన్ లు అనుకున్న విధంగా రాకపోవడం రిలీజ్ కి ఎలాగూ టైమ్ వుండటంతో హీరో రవితేజ 7 రోజులు రీషూట్ చేయాలని చెప్పారట.అనుకున్న సీన్స్ రీషూట్ పూర్తయిందిట. ఎడిట్ చేయాలి. అయితే ఆ సీన్ లని చూడకుండానే హీరో మాస్ మహారాజా రవితేజ తన తదుపరి చిత్ర షూటింగ్ కి సైలెంట్ గా వెళ్లిపోయారని దీంతో రవితేజ ఫైనల్ కాల్ కోసం దర్శకుడు ఎదురుచూస్తున్నారని ఇన్ సైడ్ టాక్.ఈ మూవీ తరువాత రవితేజ 'టైగర్ నాగేశ్వరరావు'లో నటిస్తున్న విషయం తెలిసిందే. దీని కోసం డిఫరెంట్ మేకోవర్ తో కనిపించబోతున్నారు. ఈ మూవీ సెట్ లోకి వెళితే మరో సినిమాకు వెళ్లే అవకాశం లేకపోవడంతో 'రామారావు అన్ డ్యూటీ'డైరెక్టర్ రవితేజ కోసం ఎదురు చూస్తున్నారట. ప్రొడ్యూసర్స్ 'విరాటపర్వం' ప్రమోషన్స్ పై దృష్టిపెట్టడంతో 'రామారావు ఆన్ డ్యూటీ' రిలీజ్ రవితేజ ఫైనల్ కాల్ పై ఆధారపడివుందని చెబుతున్నారు.

# రెండో టెస్టుకు ముందు కివీస్‌కు భారీ షాక్.. కేన్ మామ ఔట్



ఇంగ్లాండ్ పర్యటనలో ఉన్న న్యూజిలాండ్ నేటి నుంచి ట్రెంట్ బ్రిడ్జ్ వేదికగా జరుగబోయే రెండో టెస్టులో ఆడాల్సి ఉండగా ఆ జట్టుకు ఊహించని షాక్ తగిలింది. కివీస్ కెప్టెన్ కేన్ విలియమ్సన్ ఈ టెస్టు నుంచి తప్పుకున్నాడు. శుక్రవారం అతడికి కోవిడ్-19 పాజిటివ్‌గా నిర్ధారణ అయింది.మ్యాచ్ ఆరంభానికి కొన్ని గంటల ముందు స్వల్ప లక్షణాలు కనిపించడంతో అతడికి శుక్రవారం రాపిడ్ యాంటీజెన్ పరీక్ష నిర్వహించారు. ఇందులో విలియమ్సన్‌కు పాజిటివ్‌గా తేలడంతో అతడు ఐదు రోజులు ఐసోలేషన్‌లోకి వెళ్లాడు. విలియమ్సన్ లేకపోవడంతో ఓపెనర్ టామ్ లాథమ్ కివీస్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు.విలియమ్సన్‌కు కరోనా నిర్ధారణ అయిన విషయాన్ని కివీస్ హెడ్ కోచ్ గ్యారీ స్టెడ్ వెల్లడించాడు. కీలక మ్యాచ్‌కు ముందు అతడికి కరోనా సోకడం తమ జట్టుకు పెద్ద షాక్ అని.. అయితే ఈ టెస్టును మిస్ అవుతున్నందుకు కేన్ కూడా తీవ్ర నిరాశకు గురయ్యాడని చెప్పుకొచ్చాడు. విలియమ్సన్ స్థానంలో హమిష్ రూథర్ఫర్డ్ తుది జట్టులోకి రానున్నాడు.ఇంగ్లాండ్ తో లార్డ్స్ వేదికగా జరిగిన తొలి టెస్టులో న్యూజిలాండ్ 5 వికెట్ల తేడాతో ఓడిన విషయం తెలిసిందే. మూడు టెస్టుల ఈ సిరీస్ లో ట్రెంట్ బ్రిడ్జి టెస్టు కీలకం. కానీ ఈ మ్యాచ్ కు కేన్ మామతో పాటు కివీస్ ఆల్ రౌండర్ కొలిన్ డి గ్రాండ్‌హోమ్ కూడా దూరమయ్యారు. లార్డ్స్ టెస్టులో మడమకు గాయం కావడంతో గ్రాండ్‌హోమ్ సిరీస్ మొత్తం నుంచి తప్పుకున్నాడు. ఇప్పటికే సిరీస్ లో 1-0 తో వెనుకబడి ఉన్న కివీస్ కు ఈ ఇద్దరూ దూరమవడం ఇబ్బందికరమే.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2, OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL - 518 001. ANDHRA PRADESH.**
**PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY, 7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**